ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
# ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

ఆదివారం | 30-08- 2026 | సంపుటి: 17, సంచిక: 148, | నిజామాబాద్, | పేజీలు: 12, | వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

## అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా
# తొలగిపోకూడదు

### అనర్హులు జాబితాలో చేరకుండా పకడ్బందీ చర్యలకు ఈసీకి విజ్ఞప్తి : సీఎం రేవంత్



**92.86 లక్షల మంది ఓటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన**

**అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పెంచాలని లేఖ**

**గ్రామసభలు, వార్డు సమావేశాలు, సహాయ కేంద్రాలతో పారదర్శక సవరణకు సూచన**

హైదరాబాద్, ఆగస్టు 29 (ప్రజాకలం) :
తెలంగాణలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకుండా, అదే సమయంలో అనర్హులైన వారు ఎవరూ జాబితాలో చేరకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో తలెత్తుతున్న సమస్యలు, లోపాలు, ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులపై భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్‌కు ముఖ్యమంత్రి లేఖ రాశారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించేందుకు ప్రస్తుతం ఉన్న గడువును పొడిగించడంతో పాటు ప్రతి ఓటరుకు తగిన సమయం, అవసరమైన సహాయం, విధాన పరమైన భద్రత కల్పించాలని ఆలేఖలో కోరారు. 2026 జూన్10 నాటికి తెలంగాణ లో 3.38కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో 73.39 లక్షల మందిని గైర్హాజరైన, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లుగా గుర్తించినట్లు ముఖ్యమంత్రి ఎన్నికల సంఘం గణాంకాలను ఉటంకించారు. ఇది మొత్తం ఓటర్లలో 21.7 శాతానికి సమానమని తెలిపారు. ఈ వర్గంలోదాదాపు 62 శాతం మంది అంటే 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు.

**92.86 లక్షల మందిపై ప్రభావం?**

ఎస్ఐఆర్ ప్రక్రియలో డిజిటలైజ్ చేసిన 2.65 కోట్ల గణన పత్రాల్లో 60.50 లక్షల పత్రాల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించారని ముఖ్యమంత్రి తెలిపారు. మరో 32.36 లక్షల పత్రాలకు గత ఓటర్ల జాబితాతో అనుసంధానం జరగలేదని పేర్కొన్నారు. ఈ రెండు అంశాల నేపథ్యంలో సుమారు 92.86 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున, ఈ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

**తాత్కాలిక గైర్హాజరును శాశ్వత మార్పుగా చూడొద్దు**

ప్రస్తుత సవరణ విధానంలో కొన్ని కీలకమైన లోపాలు ఉన్నాయని ముఖ్యమంత్రి లేఖలో ప్రస్తావించారు. గణన సిబ్బంది ఇంటికి పరిశీలనకు వెళ్లిన సమయంలో తాత్కాలికంగా ఇంట్లో లేని వారిని, నిజంగా శాశ్వతంగా నివాసం మారిన వారిని ఒకే విధంగా పరిగణించడం సరికాదన్నారు. ఉద్యోగాలు, ఉపాధి, వివాహాలు, ఇతర వ్యక్తిగత కారణాలతో కొంతకాలం వేరే ప్రాంతాల్లో ఉంటున్న ఓటర్లు కూడా ఈ ప్రక్రియలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...



# సమరానికి సన్నద్ధం

**కార్యాచరణను సిద్ధం చేసిన బీజేపీ**

**5, 6 తేదీల్లో ఇందిరా పార్క్ వద్ద రెండు రోజుల దీక్ష**

**22-ఏ నిబంధనల ఉపసంహరించుకోవాలి**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అధ్యక్షతన సమావేశమైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు**

హైదరాబాద్, ఆగస్టు 29 (ప్రజాకలం) :
కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు భారతీయ జనతా పార్టీ భారీ కార్యాచరణ ను సిద్ధం చేసింది. భూభారతి పోర్టల్ లోపాలు, సెక్షన్ 22-ఏ కింద భూములను నిషేధిత జాబి తాలో చేర్చడం, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల వంటి కీలక ప్రజా సమస్యలపై కమలం పార్టీ సమరానికి సన్నద్ధమైంది. ఈ నిరసనల ద్వారా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు శనివారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు అధ్యక్షతన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కీలక సమావేశం జరిగింది. ఈ భేటీలో రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు, 22ఏ, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు, రైతుల సమస్యలపై నేతలు చర్చించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానా లపై సమగ్రంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గౌతమ్‌రావు మీడియాతో మాట్లా డారు.

తరువాయి 2వ పేజీలో...

## గోదావరి పుష్కరాలకు మరో
# రూ.40 కోట్ల నిధులు

- ఆలయ అభివృద్ధికి అన్ని వర్గాలు సహకరించాలి
- అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకుంటాం..
- పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సౌకర్యాలు
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల/ధర్మపురి, ఆగస్టు 29:(ప్రజా కలం)
ధర్మపురి క్షేత్రంలోని ఉగ్ర నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా బ్రాహ్మణులు, వేద పండితులు, స్థానిక ప్రజలు, అన్ని వర్గాల అభిప్రాయాలను తీసుకుని ముందుకు సాగుతామని తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...




## పర్యవేక్షణతో అభివృద్ధి పనులు
# నాణ్యతతో పూర్తి చేయాలి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు

- నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజా ప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలి

- రూ. 95.50 లక్షల సుడా నిధులతో రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

ఖమ్మం, ఆగస్టు 29 (ప్రజాకలం న్యూస్)
ఖమ్మం నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షణతో నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.



ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 42వ డివిజన్‌లో రూ. 95.50 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి వర్యులు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగ పడే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో చేపట్టి,

తరువాయి 2వ పేజీలో...

## రాష్ట్ర ప్రయోజనాల్లో
# రాజీ లేదు

**తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల బరాజ్**

**1న మహారాష్ట్రతో చర్చలు**

**ఉన్నతాధికారులతో సన్నాహక సమావేశం**

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



హైదరాబాద్, ఆగస్టు 29 (ప్రజాకలం) :ప్రాణహిత ప్రాజెక్టును పున రుజ్జీవిం పజేసి, తెలంగాణ రైతాంగానికి సాగునీటి ప్రయో జనాలను తిరిగి అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నదిపై 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి సాధించడమే ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇది కార్యరూపం దాల్చితే దాదాపు 80 టీఎంసీల ప్రా ణహిత జలాలను గ్రావిటీ ద్వారా సుందిళ్ల బరాజ్‌కు తరలించే

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్




## సీక్రెట్ మీటింగ్ తో బీజేపీలో హీట్

- ఎంపీ అరవింద్‌పై అసమ్మతి సెగ?



2

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

### రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**సమస్యలకు పరిష్కారం పట్టాల పంపిణీ : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**




సూర్యాపేట, ఆగస్టు 29 (ప్రజాకలం న్యూస్)
భూ భారతి చట్టం ద్వారా రాష్ట్రంలోని వివాద రహిత భూమిలన్నింటినీ సర్వే చేసి పట్టాదారు పుస్తకాలు అందజేస్తామని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో నూతనకల్, మద్దిరాల మండలాలకు సంబంధించి 1921 మంది రైతులకు 2091 ఎకరాలకు పట్టాదారు పాసు పుస్తకాలను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌లతో కలిసి పం పిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా వివాద రహిత భూములన్నింటికీ పాసు పుస్తకాలు ఇస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో మొదటి విడతన 70 గ్రామాలను ఎంపిక చేసుకొని సర్వే చేయించామన్నారు. పలుచోట్ల రెవెన్యూ, దేవాదాయ, అసైన్డ్ భూములు కబ్జాకు గురవుతుండడం తమ దృష్టికి వచ్చిందని, వీటిని అరికట్టేందుకు తాము కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రానున్న సంవత్సర కాలంలో ప్రతి అంగుళాన్ని సర్వే చేస్తామని, వివాదారహిత భూములన్నింటికీ పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తామని మంత్రి పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వం రూ.8 లక్షల ఇరవై ఒక్క వేల కోట్ల అప్పును తమ ప్రభుత్వంపై మోపినప్పటికీ తల తాకట్టు పెట్టైనా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నట్టు తెలిపారు. గడచిన రెండున్నర సంవత్సరాల్లోరాష్ట్రంలో మహిళలకు 63 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకానికి జనం బ్రహ్మ రథం పడుతున్నారని, హైదరాబాద్‌లో కోట్ల రూపాయల విలువచేసే భూముల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మించి ఇస్తున్నామన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల రైతుల సమస్యలకు పరిష్కారం పట్టాలు ఇవ్వడమేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 36వేల కోట్ల రూపాయలతో హ్యాం రోడ్లను నిర్మిస్తున్నామని, తుంగతుర్తి నియోజక వర్గానికి 100 కోట్ల రూపాయలతో రోడ్లు మంజూరు చేశామని, మరో 200 కోట్ల రూపాయల ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు.

## అంబర్ పేట్ లో ఇందిరమ్మ ఇండ్ల
# లాటరీలో రగడ

**480 ఇండ్లకు లాటరీ పద్ధతిన డ్రా**

**లబ్ధిదారులను ఎంపిక చేసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, హౌసింగ్ బోర్డ్ అధికారులు..**

**ఎస్సీ,ఎస్టీలను మళ్లీ జనరల్ లో కలపడంపై అభ్యంతరాలు**

**ప్రతిష్టాత్మకమైన కార్యక్రమానికి కాంగ్రెస్ నేతలు దూరం**




అంబర్‌పేట్ ఆగస్టు 29(ప్రజాకలం న్యూస్)
అంబర్ పేట్ నియోజకవర్గంలో 480 ఇందిరమ్మ ఇండ్లకు శనివారం నిర్వహించిన లాటరీలో పద్ధతిలో ఎస్సీ,ఎస్టీలను మళ్లీ జనరల్ లో కలపడంపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

తరువాయి 2వ పేజీలో...

# అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకూడదు

మొదటి పేజీ తరువాయి...

నిజంగా నివాసం మారిన వారికి కొత్త ప్రాంతంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం-6 ద్వారా అవసరమైన సహాయం అందించకుండా, పాత నివాస ప్రాంతంలోని ఓటును తొలగించడం సరికాదని పేర్కొన్నారు. అంతేకాకుండా ఓటరు పేరును తొలగించే ముందు తప్పనిసరిగా పాటించాల్సిన అధికారిక నోటీసు ప్రక్రియను కొన్ని సందర్భాల్లో అనుసరించడం లేదని తెలిపారు. దీంతో పోలింగ్ రోజున ఓటు వేయడానికి కేంద్రానికి వెళ్లే వరకు తమ ఓటు హక్కు తొలగిపోయిందన్న విషయం ఓటరుకు తెలియని పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు.

**మూడు జిల్లాల్లోనే అధిక భారం**

హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే రాష్ట్రంలోని మొత్తం గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లలో 58.6 శాతం కేంద్రీకృతమై ఉన్నారని ముఖ్యమంత్రి తెలిపారు. అదేవిధంగా పరిశీలన నోటీసుల్లో 41.9 శాతం కూడా ఈ మూడు జిల్లాల్లోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఉద్యోగాలు, విద్య, వివాహాలు, వలసలు, తాత్కాలిక నివాస మార్పులు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లోని ప్రతి నియోజకవర్గంలో సగటున 78 వేలకుపైగా కేసులు ఉన్నందున, కేవలం కొంతమంది అధికారులను నియమించడం ద్వారా ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడం సాధ్యం కాదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఓటర్ల నమోదు అధికారి స్థాయికి దిగువన అదనపు అధికారులను నియమించి, వికేంద్రీకృత విచారణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ముద్రిత నోటీసుల్లోనే విచారణకు హాజరుకావాల్సిన నిర్దిష్ట తేదీ, సమయాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు.

**గడువు మరో నాలుగు వారాలు పెంచాలి**

సమీప భవిష్యత్తులో తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేనందున ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను తొందరపాటు లేకుండా సమగ్రంగా నిర్వహించేందుకు తగిన సమయం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు నిర్ణయించిన అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలని కోరారు. దీంతోపాటు అక్టోబర్ 19న ప్రకటించాల్సిన తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీని కూడా సవరించాలని ఎన్నికల సంఘాన్ని విజ్ఞప్తి చేశారు. రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వయోవృద్ధులు, ఉద్యోగులు నోటీసులు అందుకున్న తర్వాత అవసరమైన పత్రాలను సేకరించి సమర్పించేందుకు వారం రోజుల సమయం సరిపోదని ముఖ్యమంత్రి తెలిపారు. వారికి కనీసం మూడు నుంచి నాలుగు వారాల గడువు ఇవ్వాలని కోరారు. అప్పుడే ప్రతి ఓటరుకు తన వాదన వినిపించుకునే, అవసరమైన ఆధారాలు సమర్పించుకునే సరైన అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.

**గ్రామసభలు.. వార్డు సమావేశాలు**

ఓటర్ల జాబితా సవరణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ముందుగానే ప్రచారం నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. కనీసం రెండుసార్లు గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివి వినిపించాలని కోరారు. ప్రజలు తమ పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలను స్వయంగా పరిశీలించుకునేలా అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నియోజకవర్గ, పోలింగ్ కేంద్ర స్థాయిలో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఓటర్లకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడంతో పాటు, ఆ పత్రాలను ఎక్కడ, ఎలా పొందాలనే విషయంలో కూడా సహకారం అందించాలని పేర్కొన్నారు. సాంకేతిక, పరిపాలనా కారణాలతో ఏ ఒక్క అర్హుడూ ఓటు హక్కును కోల్పోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఆధారాల జాబితా విస్తరించాలి**

ప్రభుత్వ ఉత్తర్వు జీవో నంబర్ 172 ప్రకారం జారీ చేసే కుటుంబ నమోదు ధ్రువపత్రాన్ని అంగీకరించకపోవడం వల్ల ముఖ్యంగా పట్టణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. మండల స్థాయిలో సులభంగా లభించే ఇతర ప్రభుత్వ పత్రాలను కూడా ఓటరు గుర్తింపు, నివాస నిర్ధారణకు అంగీకరించేలా ఆధారాల జాబితాను సవరించి విస్తరించాలని ఎన్నికల సంఘానికి సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అర్హత ఉన్న ప్రతి ఓటరుకు పూర్తి న్యాయం జరిగేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఓటర్ల జాబితా సవరణను సజావుగా, పారదర్శకంగా, ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సహాయ కేంద్రాల ఏర్పాటు, గ్రామసభలు, వార్డు సమావేశాల నిర్వహణతో పాటు పరిపాలనా పరంగా అవసరమైన అన్ని రకాల సహకారాన్ని అందిస్తామని లేఖలో పేర్కొన్నారు. అర్హుడైన ఓటరు పేరు అన్యాయంగా తొలగిపోకుండా, అనర్హుడైన వ్యక్తి జాబితాలో చేరకుండా చూడటమే ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రధాన లక్ష్యంగా ఉండాలని, ఆ దిశగా ఎన్నికల సంఘం మరింత విస్తృతమైన, పారదర్శకమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి తన లేఖలో స్పష్టం చేశారు.

# సమరానికి సన్నద్ధం

మొదటి పేజీ తరువాయి...

సెప్టెంబర్ 5, 6 తేదీల్లో 22ఏపై బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి రెండు రోజుల దీక్ష, 7వ తేదీన ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బీజేవైఎం మహా ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ యాత్ర త్వరలో నిర్వహి స్తాం అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు మండిపడ్డారు. ప్రజాసమస్యలపై బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని, క్షేత్రస్థాయి నుంచి ప్రజా ఉద్యమాలను ఉధృ తం చేసి, రేవంత్‌రెడ్డి సర్కార్ మెడలు వంచుతామని ఆయన స్పష్టం చేశారు.

**సమన్వయంతో ముందుకెళ్తాం..**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్ల రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులందరూ సమన్వయంతో కార్యాచరణ రూపొందించి, ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రస్తుతం పాలిటె క్నిక్ విద్యార్థుల సమస్యలు, నిరుద్యోగ అంశాలు, రైతుల సంక్షోభంపై దృష్టి సారించామన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థులు, రైతుల సమస్యలపై దశలవారీగా చేపట్టాల్సిన ప్రజా పోరాటాలపై పక్కా ప్రణాళికతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పర్యటించనున్నారని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా వికారాబాద్, తాండూర్ రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులను పరిశీలించనున్న ట్టు వివరించారు. చేవెళ్ల నియోజకవర్గంలో 90 శాతానికిపైగా రోడ్లను కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశం లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర సంస్థాగత ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్‌బాబు, ఎమ్మెల్సీలు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు మరో రూ.40 కోట్ల నిధులు

మొదటి పేజీ తరువాయి...

ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉగ్ర నరసింహస్వామి దేవాలయ పునర్నిర్మాణంపై శనివారం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి మంత్రి ప్రజాభిప్రాయ సేకరణ, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. బాసర, కాళేశ్వరం, భద్రాచలంతో పాటు ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి కూడా ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. ఆగమ శాస్త్రం ప్రకారం ధర్మపురిలోని ఉగ్ర నరసింహస్వామి ఆలయాన్ని పునర్నిర్మించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించిందన్నారు. ధర్మపురిలోని యోగ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి కేంద్ర పరిధిలో ఉన్నందున ముందుగా ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆలయాల వద్ద మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి తెలిపారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. గోదావరి పుష్కరాల కోసం ధర్మపురి నియోజకవర్గానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.117 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. మరో రూ.40 కోట్లను బైపాస్ రోడ్లు, పుష్కర ఘాట్ల నిర్మాణానికి విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణాన్ని రూ.10 కోట్లతో చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న యోగ నరసింహస్వామి ఆలయ ప్రతిష్ఠకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పునర్నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. స్థపతి ప్రసాద్ ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన వివరాలను సమావేశంలో వెల్లడించారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) రాజగౌడ్, ఆర్డీవో మధుసూదన్, ధర్మపురి ఆలయ ఈవో శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, ధర్మపురి బ్రాహ్మణులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# అంబర్ పేట్ లో ఇందిరమ్మ ఇండ్ల లాటరీలో రగడ

మొదటి పేజీ తరువాయి...

నియోజకవర్గానికి సంబంధించి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను అధికారులు నిర్వహించారు. చే నెంబర్ చౌరస్తా మహారాణాప్రతాప్ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, హౌసింగ్ బోర్డ్ అధికారులు పాల్గొని డ్రా తీసి లాటరీ పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొత్తం 480 ఇండ్లకు సంబంధించి లాటరీ తీశారు. ఇందులో ఎస్సీలకు 87 (14శాతం), ఎస్టీలకు 24(5శాతం).

బీసీలకు 77(18శాతం), దివ్యాంగులకు 24(5శాతం),పారిశుధ్యకార్మికులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి 48(10శాతం), జనరల్ 240(50శాతం) చొప్పున రిజర్వేషన్ కేటాయించారు. అయితే మహిళలు అధికంగా రావడంతో వారికి ప్రత్యేక కోటాను మాత్రం కేటాయించలేదు. 30 శాతం మహిళా కోటా అని చెప్పినా దరఖాస్తులు ఎక్కువగా ఉండడంతో వారి కోటా కిందా ప్రత్యేకంగా రిజర్వేషన్ ఇవ్వలేదు. అయితే ఎస్సీ,ఎస్టీలకు ప్రత్యేక రిజర్వేషన్ ద్వారా కోటా కేటాయించి డ్రా తీసిన తర్వాత మళ్లీ వారిని జనరల్ లో కలపడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేయడంతో కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు సూపర్ వైజింగ్ అధికారి మధుకర్ రెడ్డి,ఈఈ బాబురావు,ఏఈఓ హరి బాబు, సిబ్బంది పాల్గొన్నారు. డ్రా సందర్భంగా ఎలాంటి గొడవ జరగకుండా అంబర్ పేట ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఫంక్షన్ హాల్ వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా అంబర్ పేట నియోజకవర్గానికి సంబంధించి నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల డ్రా ప్రక్రియ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జాడ కనిపించలేదు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక కార్యక్రమానికి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దూరంగా ఉండడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

**మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు**

అంబర్ పేట నియోజకవర్గానికి సంబంధించి ఇందిరమ్మ ఇండ్ల డ్రా ప్రక్రియను శనివారం చే నంబర్ మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు అధికారులు తమకు సమాచారం ఇవ్వలేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామ్మోహన్ రావు ఆరోపించారు. ఫంక్షన్ హాల్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ సలహాదారులు వి. హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ అంబర్ పేట ఇంచార్జ్ రోహిన్ రెడ్డి,డిసిసి అధ్యక్షుడు రోహిత్ లకు కూడా అధికారులు సమాచారం ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక కార్యక్రమానికి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను హౌసింగ్ బోర్డ్ అధికారులు, అంబర్ పేట ఎమ్మార్వో ఆహ్వానించకపోవడం శోచనీయమన్నారు. దీనిపై ప్రభుత్వానికి, పార్టీ అధిష్టాన వర్గానికి ఫిర్యాదు చేయనున్నట్లు రామ్మోహన్ తెలిపారు.

# పర్యవేక్షణతో అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

మొదటి పేజీ తరువాయి...

పదికాలాల పాటు మన్నికగా ఉండే విధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే పనులు మరింత నాణ్యతగా పూర్తవుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని అన్నారు. నగరంలో విశాలమైన రహదారులు, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని మంత్రి పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న మంత్రి, పరిశుభ్రత వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రయోజనాల్లో రాజీ లేదు

మొదటి పేజీ తరువాయి...

అవకాశం ఏర్పడుతుందని మంత్రి తెలిపారు. దీని వల్ల ఎత్తిపోతల భారం, విద్యుత్ వ్యయాన్ని భారీగా తగ్గించవచ్చన్నారు. సెప్టెంబర్ 1న ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరగనున్న తెలంగాణ అంతర్రాష్ట్ర జల చర్చల నేపథ్యంలో శనివారం సచివాలయంలో మంత్రి ఉన్నతస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. తుమ్మిడిహట్టి బరాజ్ ఎత్తు, ముంపు ప్రభావం, సాం కేతిక సాధ్యాసాధ్యాలు, అంతర్రాష్ట్ర అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నాయని వెల్లడించారు. తెలంగాణ మధ్య అధికారిక చర్చల ప్రక్రియ ప్రారంభం కావడమే ప్రాణహిత పునరుజ్జీవనంలో కీలకమై న అడుగని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభు త్వం, నీటిపారుదల శాఖ కేంద్రంతో నిరంతరం జరిపిన సంప్రదింపులు, ఉత్తర ప్రత్యుత్తరాల ఫలితంగానే ఈ చర్చలకు మార్గం సుగమమైందన్నారు. రాష్ట్రంలోని గత ప్రభు త్వం 148 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి అంగీకరించిందని, దానికి బదులుగా 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర సమ్మతి పొందేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్(సీడబ్ల్యూపీఆర్ఎస్) సాంకేతిక అధ్యయనాల ప్రకారం 148 మీటర్ల స్థాయిలో అయితే మ హారాష్ట్ర భూభాగంలో సుమారు 1,150 ఎకరాలు.. 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మిస్తే 2,500 ఎకరాలకు పైగా ముంపునకు గుర య్యే అవకాశం ఉందని తెలిపారు. రెండు విధాలా ముంపు ఉన్నప్పటికీ.. 152 మీటర్ల స్థాయిలో బరాజ్ నిర్మిస్తే సాంకేతికంగా తెలంగాణకు అధిక ప్రయోజనం ఉంటుందన్నారు. ‘152 మీటర్ల స్థాయిలో బరాజ్ నిర్మా ణానికి మహారాష్ట్ర సమ్మతి సాధించేందుకు గత ప్రభుత్వం మరింత సమర్థంగా చర్చించాల్సి ఉండేదని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలను తగినంతగా పరిరక్షించకుండా 148 మీటర్లకు అంగీ కరించడం వల్ల తెలంగాణ ఒక కీలక అవకాశాన్ని కోల్పోయిందిన్నారు. ప్రాణహిత ప్రతి పాదనకు 1975, 1978 అంతర్రాష్ట్ర ఒప్పందాలు బలమైన న్యాయ, సంస్థాగత పునాది గా ఉన్నాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం కొత్తగా పుట్టుకొచ్చిన ఆలోచన కాదని, దశాబ్దాల క్రితం ఏర్పడిన అంతర్రాష్ట్ర అవగాహనకు అనుగుణంగా తెలంగాణ ప్రయోజనాలను సాధించే ప్రయత్నమని పేర్కొన్నారు.

**ప్రతి నీటి చుక్కనూ కాపాడుతాం**

వాస్తవానికి ప్రాణహిత్తచేవెళ్ల సుజల స్రవంతి పథకం సుమారు 16.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో రూపుదిద్దుకుందని మంత్రి ఉత్తమ్ గుర్తుచేశారు. అనంతరం జరిగిన ప్రాజెక్టు పునరాక ల్పన, పునర్వ్యవస్థీకరణలో అసలు ప్రతిపాదిత ఆయకట్టులోని గణనీయమైన ప్రాంతా లు సాగునీటి ప్రయోజనాలకు దూరమయ్యాయని తెలిపారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లోని దాదాపు రెండు లక్షల ఎకరాలకు సమర్థమైన సాగునీటి వనరు లేకుండా పోయిందన్నారు. తెలంగాణ ఏర్పడి దశాబ్దం దాటినా అసలు ప్రాణహితచేవెళ్ల పథకం ద్వారా నీరందుతుందని ఆశించిన రైతుల నిరీక్షణ కొనసాగుతూనే ఉందని పేర్కొన్నారు. ప్రాణహిత పునరుజ్జీవనం అంటే కేవలం బరాజ్ నిర్మించడమే కాదు, సాగునీటి హామీ కోల్పోయిన ప్రాంతాలకు తిరిగి జలభరోసా కల్పించడమని మంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాల్లోని చివరి ఆయకట్టు ప్రాంతాలు కూడా ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టును పునరాకల్పన చేసిన సమయంలో కీలక ప్యాకేజీలను తొలగించడంతో ఆయా ప్రాంతాలు తమకు ఉద్దేశించిన సాగునీటి వనరును కోల్పోయాయని పేర్కొన్నారు. అసలు ఆయకట్టులో ఉన్నప్పటికీ పునరాకల్పన చేసిన కాళేశ్వరం ప్రాజెక్టులో ఈ ప్రాంతాలకు తగిన జలభరోసా లభించలేదన్నారు. అందువల్ల ఆదిలాబాద్, మెదక్, రంగారెడ్డి ప్రాంతాలు సాగునీటి ప్రయోజనాలు కోల్పోయాయని, వాటిని తిరిగి అందించడమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. సెప్టెంబర్ 1న జరిగే సమావేశంలో 152 మీటర్ల ప్రతిపాదిత బరాజ్ స్థాయి, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, సాంకేతిక సాధ్యాసాధ్యాలు, అంతర్రాష్ట్ర అంశాలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చిస్తామని మంత్రి తెలిపారు. మహారాష్ట్రతో సానుకూలంగా, నిర్మాణాత్మకంగా చర్చలు జరుపుతూనే తెలంగాణకు న్యాయబద్ధంగా దక్కాల్సిన నదీజల ప్రయోజనాల విషయంలో రాజీపడబోమని స్పష్టం చేశారు. తెలంగాణకు న్యాయబద్ధంగా దక్కాల్సిన ప్రతి నీటి చుక్కను కాపాడటం మా ప్రభుత్వ బాధ్యత అని, మహారాష్ట్రతో సుహృద్భావ వాతావరణంలో నిర్మాణాత్మక చర్చలు జరుపుతామని తెలిపారు. సీడబ్ల్యూసీ చైర్మన్ అధ్యక్షతన జరిగే భేటీలో ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులతో పాటు సీడబ్ల్యూసీలోని కీలక డైరెక్టరేట్ల అధిపతులు పాల్గొంటారని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

# సీక్రెట్ మీటింగ్ తో బీజేపీలో హీట్

## - ఎంపీ అరవింద్‌పై అసమ్మతి సెగ ?



మల్లాపూర్ ఆగష్టు 29 (ప్రజా కలం ప్రతినిధి)

మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలో జరిగిన ఓ రాజకీయ భేటీ ఇప్పుడు బీజేపీ వర్గాల్లో చర్చకు కేంద్రంగా మారింది. కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులు ఒకచోట సమావేశం కావడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణతో పాటు కోరుట్ల నియోజక వర్గ నాయకుడు సురభి నవీన్, జగిత్యాల నియోజకవర్గ నాయకుడు ముదుగంటి రవీందర్ రెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొన్నట్లు సమాచారం. అయితే ఈ భేటీకి సంబంధించిన వివరాలు అధికారికంగా వెల్లడికాకపోవడంతో రాజకీయ వర్గాల్లో రకరకాల చర్చలు మొదలయ్యాయి. ఇటీవల బీజేపీలో నాయకత్వం, సమన్వయం, నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితులపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయన్న ప్రచారం నేపథ్యంలో సాతారంలో భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా ఎంపీ ధర్మపురి అరవింద్ వ్యవహారశైలిపై కొందరు నాయకులు అసంతృప్తిగా ఉన్నారన్న ప్రచారం మధ్య ఈ సమావేశం జరగడం మరింత చర్చకు దారితీసింది. అయితే సమావేశంలో అసలు ఏ అంశాలపై చర్చించారన్నది బయటకు రాలేదు. పార్టీ బలోపేతం, రాబోయే రాజకీయ పరిణామాలు, నాయకుల మధ్య సమన్వయం వంటి అంశాలపైనే చర్చ జరిగిందా? లేక పార్టీలో నెలకొన్న అంతర్గత పరిస్థితులపై నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారా? అన్నది ఇప్పుడు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది.

# ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

## - సెప్టెంబర్ 6 నుంచి జరిగే మహాసభలకు భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలి : రాష్ట్ర అధ్యక్షుడు మారగోని ప్రవీణ్‌కుమార్

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 29 (ప్రజాకలం) ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు మారగోని ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలకు జగిత్యాల జిల్లా నుంచి భవన నిర్మాణ కార్మికులు, సంఘం నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కోరుట్లలోని సి. ప్రభాకర్ భవన్‌లో శనివారం ఏఐటీయూసీ జగిత్యాల జిల్లా తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రామిల్ల రాంబాబు, ప్రధాన కార్యదర్శి ఏశమేని గణేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి మారగోని ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, కార్మికుల హక్కులు, పెండింగ్‌లో ఉన్న సంక్షేమ ప్రయోజనాలపై చర్చించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రవీణ్‌కుమార్ నాయకులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రతకు నష్టం కలిగిస్తున్నాయని విమర్శించారు. కార్మికుల హక్కులను బలహీనపరిచే నాలుగు కార్మిక చట్టాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కనీస వేతనాలు, సామాజిక భద్రత, భద్రతా ప్రమాణాలు, సంక్షేమ పథకాల అమలు కోసం ప్రభుత్వాలపై నిరంతరం ఒత్తిడి తీసుకురావాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహాసభల్లో కార్మికుల సమస్యలు, హక్కులు, భవిష్యత్ పోరాట కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, జిల్లా ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు సుతారి రాములు, ప్రధాన కార్యదర్శి ఎండి ముక్రం, మాడిశెట్టి కిరణ్‌కుమార్, ఎండి ఉస్మాన్, కాత వినయ్, మాతంగి శ్రావణ్, మామిడి రాజన్న, మహమ్మద్ అలీ, మునుగూరి గంగాధర్, గుమ్మడి అజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## కేరళ గ్లోబల్ స్కూల్లో తెలుగు భాష దినోత్సవం



రుద్రంగి, ఆగస్టు 29, (ప్రజాకలం ప్రతినిధి) రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని కేరళ గ్లోబల్ హైస్కూల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం తెలుగు భాష దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భముగా స్కూల్ చెర్మెన్ బాబు నంబీయర్ మాట్లాడుతూ.. మాతృభాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, తెలుగు భాషను మరచిపోకుండా చక్కగా నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు జీవితంలో ఒక మంచి లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించేందుకు కృషి చేయాలని, విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. క్రమం తప్పకుండా ఆటలు ఆడటం వల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామమూర్తి పంతులు చేసిన సేవలను ఉపాధ్యాయులు, విద్యార్థులు స్మరించుకున్నారు. తెలుగు భాష ప్రాధాన్యం, మాతృభాష పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లతికా, పాఠశాల ఇంచార్జ్ నరిగే విజయ్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగదేవ్ పేటలో కొనసాగుతున్న భూ రీ సర్వే



వెల్గటూర్, ఆగస్టు 29, ప్రజాకలం, ప్రతినిధి : జగిత్యాల జిల్లా, వెల్గటూర్ మండలంలోని జగదేవ్ పేట గ్రామంలో భూముల "రీ సర్వే " కార్యక్రమాన్ని తహసీల్దార్ శేఖర్ ఆధ్వ ర్యంలో రెవెన్యూ సిబ్బంది శనివారం నిర్వహించారు. కాగా జగదేవ్ పేట గ్రామాని కి సంబందించిన పూర్తి హద్దులను ముందుగా నిర్ణయించారు. అనంతరం ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి, వాటికి సంబందించిన హద్దులను నిర్ణయించిన తర్వాత, పట్ట భూములను సర్వేచేసి ఎవరివి వారికి హద్దులను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఇరిగేషన్, పంచాయతీ రాజ్, అటవి శాఖ అధికారులకు కూడా సమాచారం అందజేశారు. మొదటి విడుతలో మండలంలోని జగదేవ్ పేట రాంనూర్, మొక్కట్రావుపేట, శాఖపూర్, బీరుసాని గ్రామాలను ఎంపిక చేశారు. ఇక్కడ సర్వే పూర్తయిన అనంతరం మిగతాఎనిమిది రెవెన్యూ గ్రామాలలో సర్వే చేయనున్నారు.

## వెల్గటూర్ లో రక్త దాన శిబిరం

### - మెరుగు నరేష్ గౌడ్ జన్మదినం సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు



వెల్గటూర్, ఆగస్టు 29, ప్రజాకలం, ప్రతినిధి : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు , వెల్గటూర్ భక్తాంజనేయ ఆలయ కమిటీ చైర్మన్, సామాజిక కార్యకర్త మెరుగు నరేష్ గౌడ్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు శని వారం వెల్గటూర్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రక్త దాన శిబిరాన్ని నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. రక్తదాన శిబిరానికి భారీగా యువకులు , ప్రజా ప్రతినిధులు, పలు సంఘాల నాయకులు తరలివచ్చి రక్తదానం చేశారు. ఈ కార్య క్రమానికి వెల్గటూర్ సర్పంచ్ బండమీది కవిత గోపి, మండల వైద్యాధికారి తేజశ్రీ లు హాజరై మాట్లాడారు. రక్తదాన శిభిరం అనేది చాలా మంచి కార్యక్రమం అని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ఎంతో మంది రోగులకు అండగా నిలుస్థాయని పేర్కొన్నారు . జన్మదినం సందర్భంగా ఈరోజు ఏర్పాటు చేసిన "బ్లడ్ డొనేషన్ క్యాంప్" తో పలువురికి ప్రాణదాతలుగా నిలుస్తారని పేర్కొన్నారు. అనంతరం రక్తాన్ని దానం చేసిన వారికి సర్టిఫికెట్లను కూడా పంపిణీ చేశారు.

## నానో ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ

ఇబ్రహీంపట్నం ఆగస్టు 29 (ప్రజా కలం ప్రతినిధి)

ఇబ్రహీంపట్నం మండలం గోదూర్ గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో నానో ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా డీపీడీ సుధాకర్ నానో ఎరువుల వినియోగం, వాటి ప్రయోజనాలు, సరైన మోతాదు మరియు పిచికారీ విధానంతో పాటు నేల ఆరోగ్య నిర్వహణలో సిఫారసు చేసిన ఎరువుల మోతాదులను పాటించడం, సమతుల్య ఎరువుల వినియోగం వంటి అంశాలపై రైతులకు వివరించారు.

మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ రైతులకు ఫస్ యాప్ వినియోగం, యూరియా బుకింగ్ విధానం, సన్న రకాల వరి విత్తనాల ఆన్‌లైన్ నమోదు మరియు ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు గురించి అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆత్మ చైర్మన్ వాకిటి భూమారెడ్డి గారు, సర్పంచ్ బండి రాజేష్, ఉపసర్పంచ్ ఓంకార్ లక్ష్మణ్, ఏఈఓ లు సాగర్, వినోద్ రైతులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే

# అన్ని వర్గాలకు సమన్యాయం

### - అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి అడ్లూరి



గొల్లపల్లి ఆగస్టు 29 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని అన్నారు. ప్రపంచం కొనియాడిన మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని కాంగ్రెస్ పార్టీ ద్వారానే పేద ప్రజల సంక్షేమం జరిగిందని, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆలోచనతో దేశంలో ఇందిరమ్మ వాడలు లేని గ్రామాలు లేవని మంత్రి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం సంక్షేమ శాఖకు బాకీ ఉన్న రూ. 100 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలతో సంక్షేమ హాస్టళ్లలో 10వ తరగతి విద్యార్థులకు 99% ఉత్తీర్ణత సాధించారని మంత్రి వివరించారు. ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా యువతకు ఉన్నత విద్య చదువుకోవడానికి విదేశాల్లో ఉద్యోగ అవకాశాల కోసం శిక్షణ ఇస్తామని మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం ద్వారా నాణ్యమైన విద్యను అందించడానికి ధర్మపురి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని ధర్మపురిలో డిగ్రీ కళాశాల మంజూరు చేయించామని మంత్రి వివరించారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని యువకులు రాణించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.

ధర్మపురి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి వివరించారు. జగిత్యాల జిల్లాలో మిగిలిపోయిన అంబేద్కర్ సంఘ భవనాలు పూర్తి చేస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. దట్నూరు గ్రామంలో బ్రిడ్జి పనులు త్వరలోనే ప్రారంభిస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెక్కం గంగారాం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాపల్లి గంగన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా సంతోష్, జగిత్యాల జిల్లా మాజీ గంధ్రాలయ సంస్థ చైర్మన్ కటారి చంద్రశేఖర్ రావు, పూరపాటి రాజిరెడ్డి,అంబేద్కర్ సంఘ జిల్లా అధ్యక్షులు హన్మండ్లు, సర్పంచులు, దాసరి తిరుపతి,ఆకుల సుమన్ గౌడ్, ముల్కల శిరీష శ్రీనివాస్, తడగొండ విజయ్, చిర్ర గంగాధర్, ఒరగంటి జాన్,అంబేద్కర్ సంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే పనులను పకడ్బందీగా పూర్తి చేయాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత

### - నాన్ కెడస్ట్రాల్ రిసర్వే, ఎంజాయ్మెంట్ రీ సర్వే పనుల పరిశీలన

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 29 (ప్రజాకలం)

మేడి పెల్లి మండలం లోని దమ్మన్నపేట గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీసర్వే, ఎంజాయ్ మెంట్ రీ సర్వే పనులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రీ సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు ఎంత విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయింది, ఇంకా ఎంత మేర చేపట్టాల్సి ఉంది, పనులు ఎన్ని రోజుల్లో పూర్తవుతాయనే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో భూమి విస్తీర్ణం ఎంత ఉందని ఆరా తీశారు. సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని సూచించారు.భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. ఈ రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు చెప్పారు. సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని పేర్కొన్నారు.గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా



పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మొదట గ్రామ బౌండరీ పై లైసెన్సుడ్ సర్వేయర్లు, మండల సర్వేలు కలిసి రీ సర్వే చేస్తారని. తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. జగిత్యాల జిల్లాలో మొదటి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ప్రస్తుతం ఎంజాయ్మెంట్ రీసర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు.నడికుడగ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు.రైతులు, గ్రామస్థుల అడిగిన సందేహాలకు తగిన సలహాలు, సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ నాగార్జున, సర్వేయర్ లు , రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరుకు నోటీసు అందేలా చర్యలు తీసుకోవాలి

### - ఎస్ఐఆర్‌లో అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు అందించి పకడ్బందీగా విచారణ చేపట్టాలి

### - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

### - విచారణ ప్రక్రియను పారదర్శకంగా,నిబంధనల ప్రకారం నిర్వహించాలి

### - జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి



జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 29 (ప్రజాకలం)

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎన్ఐఆర్) కార్యక్రమంలో అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, వారితో పకడ్బందీగా విచారణ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ, పంపిణీ, విచారణ ప్రక్రియపై జిల్లాల వారీగా సమీక్షించారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు పంపిణీ చేయాలని సూచించారు. నోటీసులు అందించిన అనంతరం సంబంధిత ఓటర్లకు విచారణకు పూర్తి అవకాశం కల్పించి, వారి వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.విచారణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో సుమారు 40 వేల నో మ్యాపింగ్ ఓటర్లు, 1.52 లక్షల అనామలీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే నోటీసులు జనరేట్ చేసి, వాటి పంపిణీ ప్రక్రియను చేపట్టామని పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు విచారణ ప్రక్రియ కూడా కొనసాగుతోందని, నిర్ణీత గడువులోగా విచారణను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలోని ప్రతి వివరాన్ని నిశితంగా పరిశీలించి, అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షిస్తూ, నిబంధనల ప్రకారం అనామలీస్, నో మ్యాపింగ్ అంశాలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత ఎన్నికల అధికారులు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడాకారులే దేశ ప్రతిష్టను పెంచేది

### - చిన్ననాటి నుంచే పిల్లల్లో క్రీడలపై ఆసక్తి పెంచాలి - ఏలేటి ముత్తయ్య రెడ్డి




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 29 (ప్రజా కలం): చిన్నప్పటి నుంచే పిల్లలకు క్రీడల పట్ల ఆసక్తి కలిగించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి కోరారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మెట్టుపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం నుంచి క్రీడా ర్యాలీ ప్రారంభమై కొత్త బస్టాండ్, శాస్త్రి విగ్రహం, కూరగాయల మార్కెట్ మీదుగా జాతీయ రహదారిపై రెండు కిలోమీటర్లకు పైగా కొనసాగింది. విద్యార్థులు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.అనంతరం పలువురు క్రీడాకారులను ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ముత్తయ్య రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశ ప్రతిష్టను పెంచుతారని అన్నారు.కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గజల్ రాందాస్, జ్ఞానేశ్వర్, కొమురయ్య, కార్తీక్, క్రీడాకారుల తల్లిదండ్రులు మల్లికార్జున, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి రోడ్ల విస్తరణ పనులు ప్రారంభించాలి

### - టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మత్తమారి శశికాంత్



బెల్లంపల్లి టౌన్ ,ఆగస్టు 29, (ప్రజాకలం ప్రతినిధి) మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో ప్రధాన రహదారుల విస్తరణ పనులను ప్రారంభించాలని టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శశికాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంవత్సరం క్రితం రోడ్లకు ఇరువైపుల ఉన్న దుకాణాలను,షెడ్లను,చెట్లను తొలగించి రోడ్డు పనులను ప్రారంభించకుండా మున్సిపాలిటీ కాలయాపన చేస్తుందన్నారు.నియోజవర్గంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఉండకపోవడంతో ప్రజలకు ఉన్న సమస్యలు పరిష్కారం కావడం లేదని,గత ఎన్నికల సమయంలో ఇక్కడే ఇల్లు కట్టుకొని ప్రజలకు అందుబాటులో ఉంటానని దైవ సాక్షిగా చెప్పిన ఎమ్మెల్యే అతిధిగా రాకపోకలు జరపడం సరికాదన్నారు.రోడ్డు విస్తరణ పనులు జరగక,ఉన్న రోడ్లో గుంతలు పడి ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు అన్నారు.ఎమ్మెల్యే పట్టించుకోని రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలన్నారు. లేనియెడల రానున్న రోజుల్లో మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. పట్టణంలో నెలకొని ఉన్న ప్రతి సమస్యను పరిష్కరించాలన్నారు.

## ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గొల్లపల్లి ఆగస్టు 29 ప్రజాకలం ప్రతినిధి గొల్లపల్లి మండలం చందోలీ గ్రామానికి



చెందిన జూట నరేష్ (55) ఉరి వేసుకుని హత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు గత కొన్ని నెలలుగా మానసిక పరిస్థితి బాగాలేక అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ మానసిక ఒత్తిడికి గురై శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లోనీ దూలానికి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు జుటా నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

### బీజేవైఎం ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న

## ఫీజు బకాయిల పై ధర్నా

### - ఫీజుల బాకాయి-బీజేపీ లడాయి



ఎండపల్లి, ఆగస్టు 29 : ( ప్రజా కలం ప్రతినిధి ) తెలంగాణ బీజేపి రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు యాదగిరి బాబు, బిజెవైమ్ జిల్లా అధ్యక్షుల సూచనల తో బీజేవైఎం ఆధ్వర్యం లో ఎండపల్లి మండలం రాజారాంపల్లి వివేకానంద కూడలిలో ధర్నా నిర్వ హించడం జరిగింది. ఎండపల్లి మండల బీజేపి పార్టీ అధ్యక్షులు రావు హన్మంత రావు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొమ్ము రాంబాబు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్నటువంటి ఫీజుల బకాయిల సమస్య లపై నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కు చెల్లించాల్సిన పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బకాయిల కారణంగా విద్యార్థులు వారి యొక్క తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయం లో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని డిమాండు చేయడం జరిగింది. కొమ్ము రాంబాబు, రావు హన్మంత రావు, బీజేవైఎం అధ్యక్షులు జక్కుల సాగర్, మూల ప్రశాంత్, మేడిపల్లి రాజు, బూరగడ్డ రాకేష్, మంచి కట్ల రవి, మేడిపల్లి రాజశేఖర్, సబ్బు సంతోష్, దేవి సంతోష్, బీజేపి మండల ఉపాధ్యక్షులు గోపినవేణి గంగాచలం, దాసరి మల్లేష్, ఎనగంటి రమేష్, దుర్గం రమేష్, జెల్ల శ్రీనివాస్, మెట్టుపల్లి సాగర్, కే శ్రీకాంత్, శ్రీను, నరేష్, కొదురుపాక అశోక్, కోడిపుంజుల అంజి, ఎలేటి భాస్కర్ రెడ్డి, నాగరాజు, శ్రీను, మధుకర్, అభిరామ్, చరణ్, అభినయ్, గోపీచంద్, రాజు, విగ్నేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కలం
ఆదివారం, ఆగస్టు 30, 2026

# దారి తప్పుతున్న టీనేజ్...

పాఠశాల గేటు దాటే పిల్లల చేతుల్లో పుస్తకాలు, పెన్నులు ఉండాలి. పరీక్షల గురించి ఆలోచిస్తూ, ఆటల గురించి మాట్లాడుకుంటూ, స్నేహితులతో నవ్వుకుంటూ ఇంటికి తిరిగి రావాలి. కానీ అదే పిల్లల చేతుల్లో హత్యాయుధాలు కనిపిస్తున్నాయి. ఉపాధ్యాయులపై, తోటి విద్యార్థులపై దాడులు, డ్రగ్స్.. ఇవన్నీ పాఠశాల వయసు పిల్లల చుట్టూ విని పిస్తున్నప్పుడు "పిల్లలు చెడిపోతున్నారు" అని చెప్పి ముందుకు వెళ్లిపోవడం సరిపోదు..నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో పాఠశాల ప్రిన్సిపాల్ హత్యకు సంబంధించిన ఘటనలో పదో తరగతి విద్యార్థుల ప్రమేయం ఉందన్న విషయం ఈ ఆందోళనను మరింత పెంచింది. కూకట్‌పల్లిలో తోటి విద్యార్థిపై దాడి, నిజామాబాద్‌లో విద్యార్థినిపై లైంగిక దాడికి సంబంధించిన ఘటనలు కూడా సమాజాన్ని కలవరపెడుతున్నాయి.. ఇవి కేవలం పోలీసు కేసులు కావు.. ఇవి మన విద్యా వ్యవస్థకు, కుటుంబ వ్యవస్థకు, సమాజానికి ఎదురవుతున్న ప్రశ్నలు..ఏ పిల్లవాడూ పుట్టుకతో నేరస్తుడు కాదు. ఒక పిల్లవాడు హింసాత్మకంగా మారడం వెనుక ఇంటి పరిస్థితులు, పాఠశాల లో వేధింపులు, స్నేహితుల ఒత్తిడి, మానసిక ఒత్తిడి, సోషల్ మీడియా, సినిమాలు, డ్రగ్స్, గ్యాంగ్ సంస్కృతి వంటి అనేక ప్రభావాలు ఉండవచ్చు. పిల్లవాడు అకస్మాత్తుగా ఎక్కువగా కోప్పడటం, వస్తువులు పగలగొట్టడం, తల్లిదండ్రులతో మాట్లా డటం తగ్గించడం, పాఠశాలకు వెళ్లడానికి ఇష్టపడక పోవడం, స్నేహితులను మార్చుకోవడం, ఒంటరిగా ఉండటం, హింసాత్మక వీడియోలపై ఆసక్తి చూపించడం, బెదిరింపు భాష ఉపయోగించడం వంటి మార్పులు కనిపిస్తే వెంటనే అతడిని నేరస్తుడిగా ముద్ర వేయాల్సిన అవసరం లేదు. మన సమా జంలో పిల్లవాడు తప్పు చేసిన తర్వాత స్పందిస్తాం. కానీ అతను తప్పు చేసే దిశగా వెళ్తున్నప్పుడు మాత్రం గమనించం.స్మార్ట్‌ఫోన్, సినిమాలు, వెబ్‌సిరీస్‌లు, సోషల్ మీడియా పిల్లలకు జ్ఞానం, వినోదాన్ని అందించే సాధనాలే.. కానీ అదే సమయంలో హింస, సైబర్ బుల్లీయింగ్, డ్రగ్స్, గ్యాంగ్ కల్చర్, నేరాలను గొప్పగా చూపించే కంటెంట్ కూడా వారి ముందుకు వస్తోంది. హింసను హీరోయిజంగా, ప్రతీకారాన్ని గొప్పగా, నేరాన్ని స్టైల్‌గా చూపించే దృశ్యాలను పిల్లలు పదేపదే చూస్తున్నారు.. కొన్ని సెకన్ల షార్ట్ వీడియోల కోసం గంటల తరబడి ఫోన్‌లో గడుపుతూ, పక్కనే ఉన్న తల్లిదండ్రులతో పది నిమిషాలు మాట్లాడలేని పరిస్థితి కూడా ఏర్పడుతోంది. అయితే పిల్లల ప్రవర్తనకు ఫోన్, సినిమాలనే పూర్తిగా కారణంగా చూపడం కూడా సరైంది కాదు. సమస్య సాధ నాల్లో కంటే వాటిని పిల్లలు ఎలా ఉపయోగిస్తున్నారు, వారు చూస్తున్న కంటెంట్‌ను ఎలా అర్థం చేసుకుంటున్నారనే దాంట్లో ఉంది. అందుకే తల్లిదండ్రులు ఫోన్ లాక్కోవడం లేదా సినిమాలను నిందించడం మాత్రమే కాకుండా పిల్లలతో కలిసి కంటెంట్ గురించి మాట్లాడాలి.ఇప్పటి తల్లిదండ్రులకు మంచి పాఠశాలలో చదివించడం, సౌకర్యాలు కల్పించడం, ఖరీదైన ఫోన్ కొనివ్వడం తెలుసు.. కానీ పిల్లలతో ప్రశాంతంగా కూర్చొని మాట్లాడటానికి సమయం లేకపోవడం పెద్ద సమస్య. చదివావా ఎన్ని మార్కులు వస్తాయని అడగడం మాత్రమే కాదు. ఎలా ఉన్నావు.. ఏమైనా సమస్య ఉందా? ఎవరైనా ఇబ్బంది పెడుతున్నారా అని కూడా అడగాలి. పిల్లల చేతిలో ఫోన్ ఉందా లేదా అనేది మాత్రమే చూడటం కాదు. ఆ ఫోన్ కంటే ముందు వారి మనసులో ఏం జరుగుతుందో చూడాలి. పిల్లల నేరాలను కేవలం పోలీసుల సమస్యగా చూడలేం. ఇది కుటుం బం, పాఠశాల, ప్రభుత్వం, మీడియా, సినిమా, సోషల్ మీడి యా, సమాజం.. అందరి బాధ్యత. నేరం జరిగిన తర్వాత శిక్షిం చడం అవసరం. కానీ అంతకంటే ముఖ్యమైనది నేరం జరిగే పరిస్థితులను ముందే గుర్తించడం. పిల్లల చేతుల్లో కత్తులు వచ్చిన తర్వాత మార్చడం కంటే, ఆ కత్తి అవసరం అనిపించని బాల్యాన్ని నిర్మించడం మన అసలు లక్ష్యం కావాలి.నవ మాసాలు మోసి, కని, పెంచి, పెద్ద చేసి, తమ పిల్లలు ప్రయోజకులై ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రతి తల్లిదండ్రి కలలు కంటారు.. అయితే పిల్లలను పెంచడం మాత్రమే కాకుండా, వారిని సన్మార్గంలో నడిపించడం కూడా తల్లిదండ్రుల గురుతరమైన బాధ్యత. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల ప్రభావం పిల్లలపై తీవ్రంగా పడుతున్న నేపథ్యంలో, వారు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పిల్లల నడవడికను, వారి ఆలోచనా విధానాన్ని, స్నేహ సంబంధాలను, సామాజిక మాధ్యమాల వినియోగాన్ని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ, వారికి సరైన మార్గదర్శకత్వం అందించాలి. అంతేకాకుండా పెద్దల పట్ల గౌరవం, చిన్నల పట్ల ప్రేమ, సమాజం పట్ల బాధ్యత వంటి సద్గుణాలను అలవర్చాలి. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమైనది.ఏ లక్ష్యం కోసం అయితే, ఏ ఆశయం కోసం అయితే విద్యార్థులు మన చెంతకు చేరుతున్నారో, వారి ఆశయాలను నెరవేర్చడానికి గురువులుగా అంకితభావంతో పనిచేయవలసిన గురుతర బాధ్యత ప్రతి ఒక్క ఉపాధ్యా యుడిపై ఉంది. విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి, వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటునందించాలి. విద్యార్థులలో క్రమశిక్షణ లోపించకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉండేటట్లు ప్రతి పిల్లవాడిని తీర్చిదిద్ద వలసిన బాధ్యత అందరిపై ఉంది. 'కొందరు చేస్తారు – మేము మాత్రం చూస్తాం' అనే కొందరి ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యం వలన మొత్తం ఉపా ధ్యాయ లోకం అభాసుపాలు అయ్యే అవకాశం ఉంది. కావున పిల్లలలో క్రమశిక్షణను పెంపొందించడంలో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు భాగస్వామ్యం కావాల్సిన అవసరం తప్పనిసరి.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండేటట్లు, క్రమశిక్షణ పొంపొందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విద్యాలయాలకు కిలోమీటర్ దూరంగా ఎలాంటి మత్తు పదార్థాలనుగాని ఇతర ధూమపాన వస్తువులను విక్రయించకుండా నిషేధించాలి. ఒకవేళ అనధికారికంగా మత్తు పదార్థాలను విక్రయించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. క్రమశిక్షణ లోపించిన విద్యార్థులలో, క్రమశిక్షణ పెంపొందించడానికి కౌన్సిలింగ్ సెంట ర్లను ఏర్పాటు చేయాలి. ఏది ఏమైనప్పటికీ ఆధునిక కాలంలో కూడా విద్యార్థులలో సన్నగిల్లుతున్న క్రమశిక్షణను దారిలో పెట్టడానికి, తల్లిదండ్రులు, గురువులు, ప్రభుత్వం, సమాజ భాగస్వామ్యంతో కలిసి విద్యార్థులలో విలువలతో కూడిన విద్యను అందించి, వారిలో సత్ప్రవర్తనను పెంపొందించేటట్లు చూడాలి.

## నేడు ప్రశాంత వాతావరణంలో నీట్-పీజీ పరీక్షా నిర్వహణ



### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,ఆగస్టు 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో ఆగస్టు 30న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించనున్న నీట్–పీజీ 2026 పరీక్షను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.పెద్దకల్వల మదర్ థెరిస్సా, బండారికుంట ట్రినిటీ,సెంటినరీ కాలనీ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను డీసీపీ రామ్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు.ఉదయం 7:30 నుంచి 8:45 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను హాల్లోకి అనుమతిస్తామని,ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు,ఎంబీబీఎస్ సర్టిఫికెట్ దాని జిరాక్స్ కాపీ,కలర్ బ్యాక్–టు–బ్యాక్ అడ్మిట్ కార్డు విధిగా తెచ్చుకోవాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లో సీసీటీవీలు, మొబైల్ జామర్లు,హెచ్‌హెచ్ఎండీ ఫ్రిస్కింగ్, బార్‌కోడ్ స్కానింగ్ వంటి కఠిన భద్రతా చర్యలు ఏర్పాటు చేశామని,ఎలక్ట్రానిక్ వస్తువులు,గడియారాలు,షూస్‌ను పూర్తిగా నిషేధించామని స్పష్టం చేశారు.ఐదు టైమ్–బౌండ్ సెక్షన్లుగా ఉండే ఈ పరీక్ష కోసం రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించామని,విద్యుత్ సరఫరా,వైద్య సదుపాయాలు,పటిష్ట పోలీసు బందోబస్తుకు సంబంధిత అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య,తహసిల్దార్ రాజయ్య,సుల్తానాబాద్ తహసిల్దార్ బషీరుద్దీన్,రామగిరి తహసిల్దార్ సుమన్,పరీక్షా కేంద్రాల నిర్వాహకులు,సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరుకు పారదర్శకంగా నోటీసులు అందజేయాలి

### -రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి

పెద్దపల్లి,ఆగస్టు 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో అనామలీస్,నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, వారితో పకడ్బందీగా విచారణ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.శనివారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.అనామలీస్,నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ,పంపిణీ, విచారణ ప్రక్రియపై జిల్లాల వారీగా సమీక్షించారు.సమీకృత కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీరాములు,అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అరుణశ్రీ తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ అనామలీస్,నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు పంపిణీ చేయాలని సూచించారు.నోటీసులు అందించిన అనంతరం సంబంధిత ఓటర్లకు విచారణకు పూర్తి అవకాశం కల్పించి,వారి వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.విచారణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని,ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.నిర్ణీత గడువులోగా నోటీసుల పంపిణీ,విచారణ ప్రక్రియను పూర్తి





చేయాలని ఆదేశించారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు.జిల్లాలో సుమారు 19 వేల నో మ్యాపింగ్ ఓటర్లు,1.22 లక్షల అనామలీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.అనామలీస్,నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే నోటీసులు జనరేట్ చేసి,వాటి పంపిణీ ప్రక్రియను చేపట్టామని పేర్కొన్నారు.నోటీసులు అందుకున్న ఓటర్లకు విచారణ ప్రక్రియ కూడా కొనసాగుతోందని,నిర్ణీత గడువులోగా విచారణను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలోని ప్రతి వివరాన్ని నిశితంగా పరిశీలించి,అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షిస్తూ, నిబంధనల ప్రకారం అనామలీస్,నో మ్యాపింగ్ అంశాలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డిఓ గంగయ్య,సంబంధిత ఎన్నికల అధికారులు,తదితరులు, పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నివారణ మనందరి బాధ్యత

### - అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు



పెద్దపల్లి,ఆగస్టు 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని,డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు పేర్కొన్నారు.శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్ సమావేశంలో ఆయన పాల్గొని జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు మాట్లాడుతూ యువత జీవితాలను మాదకద్రవ్యాల మహమ్మారి నాశనం చేస్తోందని,సరదా కోసం కూడా ఎటువంటి మత్తు పదార్థాలు చెడు అలవాట్లకు అలవాటు పడవద్దని సూచించారు. ఒకసారి మాదకద్రవ్యాలకు బానిసైతే వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని,ఎక్కడైనా గంజాయి సాగు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం గంజాయి సాగుదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.డ్రగ్స్ విక్రయం, కొనుగోలు,నిల్వ,అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసు,ఎక్సైజ్,రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.అన్ని చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని,డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.జిల్లాలో మాదకద్రవ్యాలకు సంబంధించిన ప్రతి వివరాన్ని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.వన మహోత్సవం కార్యక్రమాలతో పాటు డ్రగ్స్ దుష్పరిణామాలపై ప్రజలకు,ముఖ్యంగా యువతకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.పాఠశాలలు, కళాశాలలు,హాస్టళ్లు,ప్రజా ప్రదేశాలు, రవాణా కేంద్రాల వద్ద తరచూ తనిఖీలు నిర్వహించాలని, విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై నిరంతర అవగాహన కల్పించాలని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.డ్రగ్స్‌కు బానిసైన వారు చికిత్స పొందేందుకు రామగుండం ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ–అడిక్షన్ కేంద్రాన్ని వినియోగించుకోవాలని అన్నారు.డీ–అడిక్షన్ కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.డ్రగ్స్ విక్రయం,అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖ, సంబంధిత అధికారులకు తెలియజేయాలని,సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో కీలకమని అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య,సెక్షన్ పర్యవేక్షకులు ధీరజ్,జిల్లా పోలీసు శాఖ,ఎక్సైజ్ శాఖ,వైద్య ఆరోగ్య శాఖ,విద్యాశాఖ,రెవెన్యూ శాఖ,ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పలు మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు

(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 29, ప్రజాకలం ప్రతినిధి.

పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామంలో శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు మృతుల కుటుంబాలను పరామర్శించారు.

గ్రామాల్లోని మసాని మరియా, ధమిషెట్టి రాజు, రౌతు వీరస్వామి ఇటీవల మరణించగా వారి నివాసాలకు వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలను ఎల్లవేళల అండగా ఉంటామన్నారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు సావిత్రి, గ్రామ సర్పంచ్ పద్మ యాదవ్, గ్రామశాఖ అధ్యక్షులు ఎర్రబెల్లి మధుకర్ రావు, ఉపాధ్యక్షులు శివరాత్రి సారంగపాణి, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు, వార్డు మెంబర్లు, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 29 (ప్రజా కలం): మేడిపల్లి (పడమర) ప్రభుత్వ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఈ పోటీలో పాల్గొని పద్యాలను ఆలపించారు. అనంతరం తెలుగు భాష గొప్పతనంపై విద్యార్థులు ఉపన్యాసాలు ఇచ్చి సభను నిర్వహించారు.తెలుగు పండితులు సొప్పరి శ్రీనివాస్ తెలుగు భాషా దినోత్సవం ప్రాధాన్యతను వివరించడంతో పాటు పలు తెలుగు కవితలను ఆలపించారు.ప్రధానోపాధ్యాయురాలు సి. హెచ్. నాగమణి, ఉపాధ్యాయులు శ్రీదేవి, పద్మలత, నాగన్న, జ్యోతి, భీమన్న, లక్ష్మి, ఉమా తదితరులు తెలుగు భాష గొప్పతనం, ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు.

## అన్ని కేటగిరీల ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వాలి

### - యూఎస్‌పీసీ జిల్లా శాఖ



జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 29 (ప్రజాకలం) అన్ని కేటగిరీల ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వాలని యూఎస్‌పీసీ జిల్లా శాఖ జగిత్యాల జిల్లా విద్యాధికారి కె. రాముకు యూఎస్‌పీసీ జిల్లా శాఖ ప్రతినిధులు వినతిపత్రం అందచేశారు.ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ 2026–27 విద్యా సంవత్సరానికి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు స్వీయ దరఖాస్తులు కోరిన నేపథ్యంలో, ప్రధానోపాధ్యాయులతో పాటు అన్ని కేటగిరీల ఉపాధ్యాయులకు సమాన ప్రాధాన్యత కల్పించాలని కోరారు.ప్రతి మండలానికి ప్రధానోపాధ్యాయులు సహా అన్ని కేటగిరీల నుంచి ఒక ఉత్తమ ఉపాధ్యాయుడిని ఎంపిక చేసి అవార్డు అందించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో చోటుచేసుకున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక జ్యూరీ సభ్యులుగా ఎలాంటి ప్రభావాలకు లోనుకాని తటస్థ వ్యక్తులను నియమించి, ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌పీసీ భాగస్వామ్య సంఘాల నాయకులు తిరుకోవెల శ్యామ్ సుందర్, గట్ల సంతోష్, ఎడ్ల గోవర్ధన్, అంబటి భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆరోగ్య ప్రదాయిని యోగా



పెద్దపల్లి,ఆగస్టు 29:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) మండలం లోని అప్పన్నపేట పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి యోగా పోటీలను అట్టహాసంగా నిర్వహించారు.సర్పంచ్ ఆరే సంతోష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.పురుషోత్తం,పల్లవి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జరీనా ముఖ్య అతిథులుగా హాజరైన ఈ వేడుకలో జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రవికుమార్ నాగండ్ల,సర్పంచ్ ఆరే సంతోష్ మాట్లాడుతూ యోగా కేవలం శారీరక వ్యాయామం కాదని,ఆరోగ్యం,మానసిక ప్రశాంతత,క్రమశిక్షణను అందించే గొప్ప జీవన విధానమని పేర్కొన్నారు.చిన్ననాటి నుంచే యోగా అలవాటు చేసుకుంటే విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఎదుగుతారని,ఈ పోటీల్లో ప్రతిభ చూపిన ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాల విజేతలు సెప్టెంబరు మొదటి వారంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పోతర్ల సాగర్,సంయుక్త కార్యదర్శి దొడ్డే అవినాష్,కరీంనగర్ జిల్లా కార్యదర్శి గుంటి రామకృష్ణ,వ్యాయామ దర్శకుడు డాక్టర్ వేల్పుల సురేందర్, ప్రాంతీయ నిర్వాహకుడు బొల్ల మల్లేష్, ఋషి యోగా సంస్థ వ్యవస్థాపకురాలు సునీత,నిర్వాహకులు,వ్యాయామ ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్,భగీందర్,ఇర్ఫాన్,యశ్వంత్,శ్యామల,తల్లిదండ్రులు తదితరులు పాల్గొని విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు.

## సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ఘనంగా స్పోర్ట్స్ డే కార్యక్రమం

(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 29, ప్రజాకలం ప్రతినిధి. పర్వతగిరి మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో నేడు వైభవంగా స్పోర్ట్స్ డే నిర్వహించారు. వివిధ ఆటలకు సంబంధించిన ఆట వస్తువులను ప్రదర్శించారు. విద్యార్థుల మానసిక వికాసానికి, బుద్ధి బలానికి ఆటలు ఎంతో ఉపయోగపడతాయని ప్రిన్సిపల్ జోష్నా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆటలలో రాణించిన వివిధ తరగతుల విద్యార్థులను మెడల్స్ తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిడి స్రవంతి, పిఈటి మమత, ఇతర ఉపాధ్యాయ బృందం విద్యార్థినిలు పాల్గొన్నారు.



## తాడూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**– అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు**

**– ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి**



నాగర్ కర్నూల్ ఆగస్టు 29 ప్రజాకలం ప్రతినిధి: నాగర్ కర్నూల్ జిల్లా తాడూర్ మండల కేంద్రంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డుల కార్యక్రమాన్ని నిర్వహించారు. చేశారు ఈ సందర్భంగాఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డులతో లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, పారదర్శకంగా అందుతాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజలకు అవసరమైన సేవలు వేగంగా అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు గ్రహీత ఎంఈఓ నరేందర్‌కు ఘన సన్మానం

తానూర్, ఆగస్టు 29 (ప్రజా కలం): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న మండల విద్యాధికారి (ఎంఈఓ)




నరేందర్‌ను శనివారం వడ్గావ్ గ్రామంలో గ్రామస్తుల తరఫున స్థానిక సర్పంచ్ కదం సుమన్ బాయి–గోవిందరావు పటేల్ శాలువాతో ఘనంగా సన్మానించారు, అలాగే మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ట్రెజరర్‌గా ఎన్నికైన భరత్ రెడ్డిని, వడ్గావ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేష్‌ను కూడా ప్రత్యేకంగా సత్కరించారు, ఈ సందర్భంగా గోవిందరావు పటేల్ మాట్లాడుతూ.. విద్యా రంగంలో, సమాజ సేవలో వీరు చేస్తున్న విశేష కృషికి దక్కిన ఈ గుర్తింపు ఇతరులకు స్ఫూర్తిదాయకమని అభినందించారు.

## సెన్సస్ హ్యాండ్ బుక్ సమాచారం

## ఆన్ లైన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

**– జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**




నిర్మల్ ఆగస్టు 29 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)సెన్సస్ హ్యాండ్ బుక్ మ్యానువల్ సమాచారం మొత్తాన్ని ఆన్ లైన్ చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం నిజామాబాదు నుంచి జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలాలు, మున్సిపాలిటీల వారిగా ఇప్పటివరకు సేకరించిన నిర్దేశిత సమాచారం, ఇంకా సేకరించాల్సిన వివరాలు అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. సేకరించిన సమాచారాన్ని మొత్తం నిర్దేశిత ప్రొఫార్మాలో ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. సేకరించే, ఆన్ లైన్ చేసే సమాచారం మొత్తం తప్పులు లేకుండా ఉండాలన్నారు. వివిధ శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. ఈ వీసీలో జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, సిపిఓ గంగారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలి

**అదనపు కలెక్టర్ బి చెన్నయ్య**

**జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఘనంగా ర్యాలీ**

నాగర్‌కర్నూల్, ఆగస్టు 29 (ప్రజా కలం ): మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం




నాడు నాగర్కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి పెద్ద ఎత్తున క్రీడా అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి అదనపు కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ దేశానికి అందించిన సేవలు, క్రీడా రంగంలో సాధించిన ఘనతలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. 1928, 1932, 1936 ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు వరుసగా స్వర్ణ పతకాలు సాధించడంలో ధ్యాన్‌చంద్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రతిరోజూ కనీసం గంటసేపు మైదానంలో గడపడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించే క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇంటర్ బోర్డు అధికారి వెంకటరమణ క్రీడాకారుల విద్యార్థులుతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన అవగాహన ర్యాలీలో విద్యార్థులు, యువతీ యువకులు, క్రీడాకారులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. క్రీడల ప్రాధాన్యతను తెలియజేస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు

## పల్లవి మోడల్ స్కూల్‌లో ఘనంగా

# జాతీయ క్రీడా దినోత్సవం

(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 29, ప్రజాకలం ప్రతినిధి.

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని పల్లవి మోడల్ స్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. భారతదేశంలో క్రీడలకు విశేష సేవలందించిన ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడం, ఆరోగ్యం, క్రమశిక్షణ, పట్టుదల, జట్టు స్ఫూర్తి వంటి విలువలను పెంచడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక్ చారి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు ఆత్మవిశ్వాసం, ఉత్సాహం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. ప్రతి విద్యార్థి తనకు ఇష్టమైన క్రీడలో ప్రతిభను అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల కరస్పాండెంట్ గండి మహేందర్ మాట్లాడుతూ, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వ్యాయామం చేయడం ద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన శరీరంలోనే చురుకైన ఆలోచనలు ఉంటాయని, అందువల్ల విద్యార్థులు రోజువారీ జీవితంలో క్రీడలు, వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ కోటగిరి రమేష్ మాట్లాడుతూ, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలంటే




చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. క్రీడలు క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, ఓటమిని స్వీకరించే ధైర్యం, విజయాన్ని సాధించే సంకల్పాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు తమ ప్రతిభను గుర్తించి నిరంతరం సాధన చేస్తే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ప్రతిరోజూ ఏదో ఒక క్రీడలో పాల్గొని తన నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. క్రీడల్లో నిరంతర సాధన, క్రమశిక్షణతో మంచి ప్రతిభను సాధించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడల ప్రాముఖ్యతను వివరించడంతో పాటు వివిధ క్రీడలు, శారీరక వ్యాయామాలపై అవగాహన కల్పించారు. చదువుతో పాటు క్రీడలు, ఆరోగ్యంతో పాటు విజయాలు అనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్లు రాజు, నవ్య శ్రీ, వకులదేవి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మిషన్ భగీరథ నీటికి 'పొలం' బాట!

**–తాగునీటిని సాగునీటిగా మళ్లిస్తున్నారన్న ఆరోపణలు**

**–పైప్‌లైన్ నుంచి పొలాలకు నీటి మళ్లింపు.. వాటర్‌మెన్ వివరణపై స్థానికుల ఆగ్రహం**

**–బురదమయమైన రహదారి.. స్పాట్ ఇన్‌స్పెక్షన్ చేసి వాస్తవాలు తేల్చాలని డిమాండ్.**

ఆగస్టు 29, ప్రజాకలం ప్రతినిధి (వరంగల్/వర్ధన్నపేట)

ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మిషన్ భగీరథ తాగునీరు పొలాల వైపు మళ్లుతోందా? అనే ఆరోపణలు వర్ధన్నపేట పరిధిలోని భవానీకుంట తండాలో చర్చనీయాంశంగా మారాయి. తాగునీటి పైప్‌లైన్‌కు మరో పైప్‌ను అనుసంధానం చేసి నీటిని వ్యవసాయ అవసరాలకు వినియోగిస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

**తాగునీరు.. పొలాల బాట!**

తండాలోని ఓ ప్రాంతంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి నీరు బయటకు వచ్చి పొలాల వైపు ప్రవహిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో పైప్ కనెక్షన్ ఎవరు ఏర్పాటు చేశారు? అధికారిక అనుమతి ఉందా? నీటిని ఏ అవసరానికి వినియోగిస్తున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజల తాగునీటి అవసరాల కోసం సరఫరా చేస్తున్న నీటిని వ్యవసాయ అవసరాలకు మళ్లిస్తున్నట్లు తేలితే ప్రభుత్వ ఉద్దేశానికి విరుద్ధమని స్థానికులు పేర్కొంటున్నారు.



"నీరు ఎక్కడికి పోతుందో నా బాధ్యత కాదు" వ్యవహారంపై వాటర్‌మెన్‌ను వివరణ కోరగా.. ట్యాంక్ నిండిన తర్వాత నీటిని ఆపాల్సిన బాధ్యత సిబ్బందిదని, అధికారుల నిర్లక్ష్యమే తప్ప తనకు సంబంధం లేదని చెప్పినట్లు స్థానికులు తెలిపారు."నీటిని బయటకు పంపించడం నా బాధ్యత.. ఆ నీరు ఎక్కడికి వెళ్తుందో నాకు సంబంధం లేదు" అన్నట్లుగా ఆయన పేర్కొన్నారని స్థానికులు చెబుతున్నారు. అయితే తాగునీటి సరఫరాను పర్యవేక్షించే సిబ్బంది నీటి వినియోగంపై బాధ్యత లేదనడం ఎలా సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.

**నీటితో రహదారి బురదమయం**

మరోవైపు పైప్‌లైన్ నుంచి వెలువడుతున్న నీరు రహదారిపైకి చేరడంతో దారి బురదమయంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు తోడు నీరు రోడ్డుపై నిలవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ఒకవైపు తాగునీరు వృథా అవుతుండగా.. మరోవైపు ప్రజలు ప్రయాణించే రహదారి బురదమయంగా మారడం అధికారుల పర్యవేక్షణపై అనుమానాలకు తావిస్తోందని స్థానికులు అంటున్నారు.

**స్పాట్ ఇన్‌స్పెక్షన్ చేయాలి**

ఈ వ్యవహారంపై సంబంధిత మిషన్ భగీరథ, నీటి సరఫరా, మున్సిపల్ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని తండావాసులు డిమాండ్ చేస్తున్నారు. పైప్‌లైన్‌కు అనుసంధానించిన పైప్ ఎక్కడి నుంచి వచ్చింది? దానికి అనుమతి ఉందా? నీరు ఏ అవసరానికి వినియోగిస్తున్నారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు. అనుమతి లేకుండా తాగునీటిని వ్యవసాయ అవసరాలకు మళ్లిస్తున్నట్లు అధికారుల విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## హక్కుల కోసం కార్మికులు కర్షకులు కదలిరండి

**– ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయండి**

**– జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ పిలుపు**




నాగర్ కర్నూల్ ఆగస్టు 29 ప్రజా కలం (ప్రతినిధి): కరీంనగర్ పట్టణం సెప్టెంబర్ 6 7 8 తేదీల్లో నిర్వహించే ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ తెలిపారు. ఈ మహాసభలను జయప్రదం చేసేందుకు కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలోని కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామంలో హమాలీ కార్మికులతో ఏఐటీయూసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూ.5 వేల పింఛన్ అందించాలని కోరారు. హమాలీ కార్మికుల పిల్లలకు కార్పొరేట్ విద్య, వైద్యంలో అధిక ప్రాధాన్యత కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో 25 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన హమాలీ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**ఎనిమిది గంటల పని కోసం ఏఐటీయూసీ పోరాటం**

1886లో అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులు 8 గంటల పని 8 గంటల విశ్రాంతి 8 గంటల వినోదం కోసం పోరాటం చేశారని గుర్తుచేశారు. 18 గంటల పని దినాన్ని 8 గంటలకు తగ్గించేందుకు జరిగిన ఉద్యమంలో కార్మికులు ప్రాణత్యాగాలు చేశారని తెలిపారు. కార్మికుల పోరాటాల ఫలితంగా సాధించిన హక్కులను కాపాడేందుకు ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతోందన్నారు. 1920 అక్టోబర్ 31న ఏఐటీయూసీ ఆవిర్భవించి దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిందని చెప్పారు. కార్మిక చట్టాల సాధనలో ఏఐటీయూసీ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తప్పిట కిరణ్ కుమార్ హమాలి వర్కర్స్ కురుమయ్య రాజు శ్రీకాంత్ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అరూరి

(వరంగల్/పర్వతగిరి)ఆగస్టు 29, ప్రజాకలం ప్రతినిధి. వర్ధన్నపేట నియోజకవర్గం పర్వతగిరి మండలం ఏనుగల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దమ్మిశెట్టి సంధ్యరాణి– నర్సింగం సోదరుడు రాజు, రౌతు వీరస్వామి, మాసాని మరియా ఇటీవల మరణించగా శనివారం వారి నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం శ్రీనగర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు గుమ్మడి శ్రీనివాస్ ప్రమాదవశాత్తు గాయపడగా నేడు వారి నివాసానికి వెళ్లి పరామర్శించిన వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు, మండల నాయకులు, టిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్

**– రాజీ మార్గమే రాజమార్గం.. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి: జడ్జి డి. రమాకాంత్**



నాగర్‌కర్నూల్ ఆగస్టు 29 (ప్రజా కలం ): జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాల్లో సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారి డి రమాకాంత్ తెలిపారు. లోక్ అదాలత్ ఏర్పాట్లు, కేసుల పరిష్కారంపై పోలీస్ ఉన్నతాధికారులతో జిల్లా కోర్టు ప్రాంగణంలో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి డి. రమాకాంత్ హాజరై మాట్లాడుతూ.. 'రాజీ మార్గమే రాజమార్గం' అని పేర్కొన్నారు. లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు తమ కేసులను సత్వరంగా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. లోక్ అదాలత్‌లో వెలువడే తీర్పులకు అప్పీల్ అవకాశం ఉండదని, దీంతో సమయం, డబ్బు ఆదా అవుతాయని తెలిపారు. లోక్ అదాలత్‌లో భూతగాదా కేసులు, రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు, మోటారు వాహన ప్రమాద కేసులు, బ్యాంకు కేసులు తదితర పెండింగ్ కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా ఇరువర్గాలు పరస్పర అంగీకారంతో కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఇరువర్గాలు రాజీ పడటం ద్వారా సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు మానవ సంబంధాలు కూడా బలపడతాయని జడ్జి పేర్కొన్నారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని తమ కేసులకు త్వరిత పరిష్కారం పొందాలని సూచించారు. సమావేశంలో నసీం సుల్తానా, నిహారిక, శృతి దూత, ఎన్. శ్రీనిధి తదితరులతో పాటు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొని లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**- మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు**



నిర్మల్ ఆగస్టు 29 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను నిర్మల్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశాలతో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా హాకీ అసోసియేషన్ సహ ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల అధికారి బి. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. భారత హాకీకి ప్రపంచస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో మేజర్ ధ్యాన్‌చంద్ చేసిన కృషి, ఆయన ప్రతిభ, అంకితభావం చిరస్మరణీయమని అన్నారు. ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు, యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

క్రీడలు కేవలం పోటీలకే పరిమితం కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగం కావాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు క్రీడా కోటా ద్వారా ప్రభుత్వంతో పాటు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. యువత తమ ప్రతిభను గుర్తించి క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రాథోడ్ లక్ష్మణ్, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు పాకాల రాంచందర్, పీడీలు రమణారావు, రవీందర్‌గౌడ్, అన్నపూర్ణ, భూమన్న, సత్తయ్య, బుచ్చిరామారావు, సుధార్‌సింగ్, పోశెట్టి, వంశీ, కె. శ్రీనివాస్, పీఈటీలు సంజీవ్, గంగాధర్, ముకేష్, భీమేశ్, గిరి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## ఎల్వీ గ్రామంలో బాధితుల కుటుంబాలను పరామర్శించిన భోస్లే మోహన్‌రావు పాటిల్

తానూర్,ఆగస్టు 29(ప్రజా కలం): మండలంలోని ఎల్వీ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బాపూరావు తండ్రి శంకర్ (మాజీ సర్పంచ్) అలాగే డి. పోతన్న మాతృమూర్తి బీరాబాయి ఇటీవల మృతి చెందారు, విషయం తెలుసుకున్న 'మోహన్‌రావు పాటిల్ ప్రజా ట్రస్ట్' చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకులు భోస్లే మోహన్‌రావు పాటిల్ ఆదివారం వారి నివాసాలను సందర్శించారు, బాధిత కుటుంబ సభ్యులను కలసి మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు,వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, అధైర్యపడవద్దని మనోధైర్యాన్ని నింపారు, ఈ పరామర్శ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, వార్డు మెంబర్లు, యువకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

## ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి - క్షేత్రస్థాయి సిబ్బందిని సమన్వయం చేయాలి

## గ్రామాల సమగ్ర అభివృద్ధికి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు పకడ్బందీగా రూపొందించాలి:

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 29:

గ్రామాల స్థానిక అవసరాలను గుర్తించి, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ సమగ్ర అభివృద్ధికి పకడ్బందీగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు రూపొందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎ+గ్రాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలు, మండల స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, టెక్నికల్ సిబ్బందికి అవగాహన కల్పించారు.గ్రామ పంచాయతీల అభివృద్ధి, పరిపాలన, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన శిక్షణలో ఇచ్చిన సూచనలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని ఆయన అన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య రంగాలతో పాటు తాగునీరు, పారిశుధ్యం, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు తదితర అంశాలకు ప్రాధాన్యతనిస్తూ గ్రామాల వారీగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అవసరాలను గుర్తించాలని, ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. ప్రణాళికల అమలులో నాణ్యత, పారదర్శకత, సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి మండలంలో గ్రామ పంచాయతీల వారీగా ప్లానింగ్ షెడ్యూల్ సిద్ధం చేసి, మండల స్థాయి ప్లానింగ్ బృందాల ఏర్పాటు వివరాలను సమర్పించాలని ఎంపీడీవోలను ఆదేశించారు.

ప్రతి చుక్క నీటిని ఒడిసిపట్టాలి:

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఫార్మ్ పాండ్స్, ట్రెంచ్‌లు, సోక్‌పిట్స్, గ్రే వాటర్ మేనేజ్‌మెంట్, వాటర్ హార్వెస్టింగ్ వంటి పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు.

జిల్లాలో కురిసే ప్రతి చుక్క వర్షపు నీటిని సాధ్యమైనంత వరకు జిల్లాలోనే నిల్వ చేసి, భూగర్భ జలాలను రీచార్జ్ చేసేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. రైతులు ఫార్మ్ పాండ్స్ ఏర్పాటుకు ముందుకు వచ్చేలా అధికారులు అవగాహన కల్పించడంతో పాటు వారిని ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు కేవలం ఆదేశాలు ఇవ్వడం కాకుండా ఫార్మ్ పాండ్స్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని అన్నారు. వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి, భవిష్యత్తులో బోర్లలో నీటి లభ్యత మెరుగుపడి పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని రైతులకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు.

**క్షేత్రస్థాయి సిబ్బందిని సమన్వయం చేయాలి:**

ఎం.పి.డి.ఓ లు, ఎం.పి.ఓ లు, ఏ. పి.ఓ లు తమ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ సిబ్బందిని సమన్వయం చేసుకుని పనిచేయించాలని మధుసూదన్ నాయక్ అన్నారు. అవసరమైన చోట గ్రామసభలు నిర్వహించి, సర్పంచులు, ప్రజలను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు.



మండల స్థాయిలో అధికారుల మధ్య సమన్వయం మరింత పెరగాలని, ప్రతి గ్రామంలో జరుగుతున్న పనులు, వాటి పురోగతి, ఎదురవుతున్న సమస్యలను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.

**ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి**

ఉపాధి హామీ పనుల్లో లేబర్ మొబిలైజేషన్‌పై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లాలో పెద్ద సంఖ్యలో యాక్టివ్ జాబ్ కార్డులు ఉన్నప్పటికీ, అందుకు అనుగుణంగా పనిదినాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి మండలంలో లేబర్ తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, కారణాలను విశ్లేషించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలు, కూలి చెల్లింపులు, ప్రభుత్వ పనుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాను అన్ని అభివృద్ధి సూచీల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు.మండల స్థాయిలో పనిచేసే ఎంపీడీవోలు ప్రజలకు అత్యంత చేరువగా ఉండే కీలక అధికారులు అని పేర్కొంటూ, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా ముందుండి పనిచేయాలని సూచించారు.అధికారుల సమిష్టి కృషితో జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో నిలపాలని, ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని మధుసూదన్ నాయక్ కోరారు.అంతకు ముందు, డి. ఆర్. డి.ఓ నరసింహులు,వి. జి. పి. పి ప్రణాళికను అన్ని శాఖల కన్వర్జెన్స్ తో రూపొందించుకోవాలని అన్నారు.

జిల్లా ఉద్యానశాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, పశుసంవర్ధక శాఖ జె.డి శివానంద స్వామి, మత్స్యశాఖ డి.డి రాధ రోహిణి మాట్లాడుతూ వారి వారి శాఖల ద్వారా అమలుచేస్తున్న పథకాలు, చేపడుతున్న పనులు, వాటి నిర్వహణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా శాఖల ద్వారా చేస్తున్న, చేయబోయే పనులను కూడా గ్రామ పంచాయతీ ప్రణాళికలో పొందపరచుకోవాలని కోరారు.

కార్యక్రమంలో జెడ్.పి.సి.ఈ.ఓ, ఇంచార్జ్ డి.పి.ఓ వెంకట రెడ్డి, అదనపు డి . ఆర్.డి.ఓ వామన రావు, అన్ని మండలాల ఎం.పి.డి ఓ లు, ఎ.పి.ఓ లు, ఈ.సి లు, టి.ఎ లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# మహిళా పారిశ్రామికవేత్తల ఉన్నతికి 'ర్యాంప్' వరం

## - వ్యాపార విస్తరణ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

## - ర్యాంప్-ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం'పై అవగాహన సదస్సు

నిర్మల్ ఆగస్టు 29 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

మహిళలు పారిశ్రామిక రంగంలో రాణించి ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో విజయలక్ష్మి సూచించారు. మహిళా పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాలను మరింత విస్తరించుకునేందుకు 'ర్యాంప్–ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం' చక్కటి అవకాశమని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ ఆధ్వర్యంలోని వి–హబ్ సౌజన్యంతో జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళా పారిశ్రామికవేత్తలకు శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'ర్యాంప్–ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రపంచ బ్యాంకు, కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంయుక్త సహకారంతో 'ర్యాంప్' పథకాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న సూక్ష్మ, చిన్న తరహా వ్యాపార సంస్థలను మరింత వేగంగా అభివృద్ధి చేయడం, వాటి సామర్థ్యాన్ని పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పథకం కింద ఎంపికైన మహిళా పారిశ్రామికవేత్తలకు రెండేళ్లపాటు ప్రత్యేక శిక్షణ, మార్గదర్శకత్వం, అవసరమైన సహకారం అందిస్తారని నిర్వాహకులు తెలిపారు. జౌళి, ఆహార శుద్ధి, తయారీ, చేతివృత్తులు, హస్తకళలు తదితర రంగాల్లోని వ్యాపార సంస్థలకు ప్రోత్సాహం కల్పిస్తారన్నారు. వ్యాపార నిర్వహణ



నైపుణ్యాల పెంపు, ఉత్పత్తుల నాణ్యత మెరుగుదల, కొత్త ఉత్పత్తుల రూపకల్పన, ఉత్పత్తుల వైవిధ్యీకరణ, బ్రాండింగ్, మార్కెటింగ్‌లో అవసరమైన సహకారం అందిస్తారని వివరించారు. బ్యాంకుల ద్వారా రుణ అనుసంధానం కల్పించడంతో పాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులతో వ్యక్తిగత మెంటరింగ్ అందించి వ్యాపారాలను మరింత లాభదాయకంగా తీర్చిదిద్దేందుకు తోడ్పాటునందిస్తారని తెలిపారు. సదస్సులో 'ర్యాంప్–ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం'కు సంబంధించిన అర్హతలు, ఎంపిక విధానం, శిక్షణ, ప్రయోజనాలు, వ్యాపార విస్తరణకు అందించే సహకారంపై మహిళలకు అధికారులు అవగాహన కల్పించారు. వ్యాపారాలను విస్తరించేందుకు ఆసక్తి చూపిన పలువురు మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం మారుతి, వి–హబ్ డైరెక్టర్ జాహిద్ షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఊహ, ప్రతినిధులు డాక్టర్ డెబోశ్రీ, రూపానంద్, హరిచందన, స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# జడ్చర్ల మున్సిపాలిటీ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## – స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 29:

జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి, పారిశుధ్య, పౌర సేవల కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో జడ్చర్ల మున్సిపాలిటీకి చెందిన అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని వివిధ విభాగాల పనితీరు, ఆయా విభాగాల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాల పురోగతిని విభాగాల వారీగా సమీక్షించారు.మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల స్థితిగతులు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత నిర్వహణ, ప్రజలకు అందుతున్న మున్సిపల్ సేవలు, పన్నులు తదితర ఆదాయ వసూళ్ల పురోగతి, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై అదనపు కలెక్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు మున్సిపల్ సేవలు ఎలాంటి జాప్యం లేకుండా అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టణంలో పారిశుద్ధ్యం, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంపొందించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న పన్నులు, ఇతర ఆదాయ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటికే ప్రారంభమైన అభివృద్ధి పనులను నిర్దేశిత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రతి విభాగం తనకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, మున్సిపాలిటీ అభివృద్ధి , ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కీలకపాత్ర పోషించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు.

# పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి



## - జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య

పాలేరు ఆగష్టు 29(ప్రజా కలం న్యూస్ ) డిజిటల్ క్రాప్ సర్వేలో పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, ప్రతి రైతు పంట వివరాలను తప్పులేకుండా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య, సూచించారు. శనివారం గురవాయిగూడెం గ్రామంలో డిజిటల్ క్రాప్ సర్వే వాలంటీర్ వెంకటేష్ నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వేను ఆయన పరిశీలించి, తగు సూచనలు చేశారు. రైతులు పండించిన పత్తి, వరి, పెసర తదితర పంటల వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు.

పంట ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే సమయంలో రైతుల వివరాలు, పంట వివరాలు సరిగా నమోదు కాకపోతే నష్టపోయే అవకాశం ఉందని ఆయన తెలిపారు. అందువల్ల పంటల నమోదు సమయంలో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తగా ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయాలని వాలంటీర్లను ఆదేశించారు.రైతులు తమ గ్రామాల్లో పంటల వివరాలను నమోదు చేస్తున్న వాలంటీర్లను సంప్రదించి, తమ పంట వివరాలు తప్పులేకుండా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు.

వాలంటీర్లు త్వరితగతిన రైతుల పంట వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ఎప్పటికప్పుడు వాలంటీర్లతో మాట్లాడి, వారికి ఎదురవుతున్న సందేహాలను నివృత్తి చేస్తూ సర్వేను త్వరగా పూర్తి చేయించాలని సూచించారు.అనంతరం అపరాలలో మిషన్ ఫర్ ఆత్మనిర్భరత పథకం ద్వారా రాయితీపై పెసర విత్తనాలను రైతులకు అందించారు.అనంతరం పెసర మరియు ప్రత్తి పంటను పరిశీలించి రసం పీల్చు నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ పీడీ సరిత, కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రాజేష్, మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, తదితరులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్‌లో జనసేన ఆత్మీయ సమావేశం

## ఉయ్యాలవాడ నుంచి నాగర్‌కర్నూల్ వరకు భారీ ర్యాలీ.. జనసేన జెండాలు నినాదాలతో మార్మోగిన పట్టణం

నాగర్‌కర్నూల్ ఆగస్టు 29 (ప్రజా కలం ):

నాగర్‌కర్నూల్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉయ్యాలవాడ నుంచి నాగర్‌కర్నూల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించగా పెద్ద సంఖ్యలో జనసైనికులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. జనసేన జెండాలు చేతబూని కార్యకర్తలు చేసిన నినాదాలతో ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. ర్యాలీలో యువత, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పార్టీ బలోపేతం భవిష్యత్ కార్యాచరణ ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించారు. జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని



నాయకులు, కార్యకర్తలు పిలుపునిచ్చారు. కార్యకర్తల మధ్య ఆత్మీయత, ఐక్యతను పెంపొందించేలా సమావేశం కొనసాగింది. భారీగా తరలివచ్చిన జనసైనికులతో నాగర్‌కర్నూల్ సందడిగా మారింది పార్టీ శ్రేణులు ఐక్యత, ఉత్సాహంతో ముందుకు సాగుతూ జనసేనను మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# మండల అభివృద్ధిలో అలసత్వం వద్దు

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 29: మండల అభివృద్ధిలో అలసత్వం వద్దు, ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి మహబూబ్‌నగర్ రూరల్ మండల కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ రూరల్ మండల పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి 45 రోజులకు ఒకసారి మండల స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అన్నారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం నుంచి ఐదుగురు విద్యార్థులు ఐఐఐటీలో సీట్లు సాధించినట్లు ఎంఈఓ సమావేశంలో వెల్లడించారు. దీనిపై ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేస్తూ, ఐఐఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులను తదుపరి మండల స్థాయి సమీక్షా సమావేశానికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వారిని ఘనంగా సన్మానించి ప్రోత్సహిస్తామని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారి విజయాన్ని ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిపినట్లవుతుందని, అదే సమయంలో ఇతర గ్రామాల సర్పంచులకు కూడా విద్యార్థుల విద్యాభివృద్ధిపై అవగాహన కల్పించినట్లవుతుందని పేర్కొన్నారు.




ఎల్‌నినో ప్రభావంతో మండలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన ఎలాంటి భవనాల నిర్మాణంలోనూ జాప్యం చేయవద్దని ఎమ్మెల్యే సూచించారు. భూమి లేదనే కారణంతో భవనాల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేయకుండా, గ్రామ కంఠంలోని ప్రభుత్వ భూమిని అవసరమైన భవనాల నిర్మాణానికి కేటాయించాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణంలో కూడా అలసత్వం వీడాలని అన్నారు. పాఠశాలల్లో పిల్లలకు అవసరమైన టాయిలెట్లను నిర్మించడం అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. మండలంలో లో–వోల్టేజ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, సేకరించిన భూమిని విద్యుత్ శాఖకు అప్పగించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. వివిధ గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని, ఆయన సర్పంచులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీమతి బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీమతి కరుణశ్రీ, తహసీల్దార్ శ్రీనివాసులు, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మ ఆధ్వర్యంలో రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్ శిక్షణ

పాలేరు ఆగష్టు 29(ప్రజా కలం న్యూస్ )

కూసుమంచి శనివారం రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేయాలనే లక్ష్యంతో ఆత్మ ఆధ్వర్యంలో కూసుమంచి రైతు వేదికలో బీఎఫ్ఏసీ సమావేశం అనంతరం రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మ కమిటీ చైర్మన్ శివరామకృష్ణ , జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య గారు, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరిత , కుసుమంచి ఏడీఏ రాజేష్ పాల్గొని రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు నానో ఎరువుల వినియోగం, వాటి ప్రయోజనాలు సరైన పద్ధతిలో వినియోగించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. అలాగే ఎల్‌నినో ప్రభావం వల్ల వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, వాటి ప్రభావం వ్యవసాయంపై ఎలా ఉంటుందనే అంశాలను వివరించారు. రైతులు ఎరువుల వినియోగాన్ని సక్రమంగా నిర్వహించేందుకు ఎరువుల యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు.



ఎరువుల లభ్యత, వినియోగం తదితర వివరాలను తెలుసుకోవడంలో యాప్ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.అదేవిధంగా ప్రస్తుత సాగు పరిస్థితులకు అనుగుణంగా వరి, పత్తి పంటల్లో చీడపీడలు మరియు తెగుళ్ల నివారణ, సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులు, పురుగుమందుల సరైన వినియోగం తదితర అంశాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. పంటలను తరచుగా పరిశీలిస్తూ, చీడపీడలు మరియు తెగుళ్లను గుర్తించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్ కార్యక్రమం ద్వారా రైతులు తమ అనుభవంతో పొందిన వ్యవసాయ నైపుణ్యాలను గుర్తించి, అవసరమైన శిక్షణ పొందే అవకాశం ఉందని అధికారులు వివరించారు.ఈ కార్యక్రమంలో కూసుమంచి డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు రామడుగు వాణి, రాధా ఉమా నగేష్, రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి అరుణజ్యోతి , ఆత్మ దీవీ ఉపేందర్ , వ్యవసాయ విస్తరణ అధికారులు రవీందర్, ప్రియాంక, రవికుమార్, ఆత్మ డైరెక్టర్లు మరియు రైతులు పాల్గొన్నారు.

# మంచి మిత్రుడిని కోల్పోయా..

## - గోపిశెట్టి వెంకటేశ్వర్లు..



తల్లాడ ఆగస్టు 29 ప్రజా కలం న్యూస్ స్నేహానికి మారుపేరుగా నిలిచే మంచి మిత్రుడుని కోల్పోయానని కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వర్లు కన్నీటి పర్యంతమయ్యారు. తన చిరకాల స్నేహితుడు తల్లాడ మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన దుండేటి కేశవరెడ్డి శనివారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ తాను రాజకీయంగా ఏ పార్టీలో ఉన్నప్పటికీ నా వెంటే నడిచారని గుర్తు చేశారు. ఆయన మరణం తనకు తీరని లోటు అన్నారు. ఆ కుటుంబానికి భగవంతుడు ధైర్యం కల్పించాలని అన్నారు. ఆయనతోపాటు వై రా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, నాయకులు కోడూరు వీరకృష్ణ, దగ్గుల అప్పిరెడ్డి ఆయన మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# కేశవరెడ్డికి నివాళులర్పించిన నాయకులు,ప్రజా ప్రతినిధులు

## – ఘనంగా నివాళులర్పించిన తల్లాడ జర్నలిస్ట్ సంఘం



తల్లాడ ఆగస్టు 29, ప్రజా కలం న్యూస్ మాజీ సొసైటీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి సోదరుడు దుండేటి కేశవరెడ్డి అనారోగ్యంతో శనివారం ఉదయం 7.0 గంటలకు మృతి చెందారు.విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ నాయకులు, మరియు వివిధ పార్టీల నాయకులు గొల్లగూడెంలో ఆయన గృహానికి చేరుకొని కేశవరెడ్డి భౌతిక ఖాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోపిశెట్టి వెంకటేశ్వర్లు,దిరిశాల నరసింహారావు, పగడాల లచ్చిరెడ్డి, కోడూరి వీరకృష్ణ,ధూపాటి భద్రరాజు, మారెళ్ళ మల్లికార్జునరావు, తుమ్మలపల్లి రమేష్, దీవెల కృష్ణయ్య, తాళ్ల జోసఫ్,కోడూరి శ్రీనివాసరావు,పొట్టేటి జనార్దన్ రెడ్డి,తూము వెంకట నారాయణ, నున్న శ్రీను,సారక్క రెడ్డి తదితరులు కేశవరెడ్డికి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

# కాంగ్రెస్ నాయకుల మృతి పట్ల రాష్ట్ర రెవెన్యూ మంత్రి శ్రీనివాస్ రెడ్డి సంతాపం



మధిర ఆగస్టు 29(ప్రజా కలం న్యూస్ ) ముదిగొండ మండలంలోని ఖానాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొదిల దేవేంద్రం, తల్లాడ మండలం గొల్లగూడెంకు చెందిన కాంగ్రెస్ నాయకులు, మంత్రి పొంగులేటి అనుచరులు దుండేటి కేశవరెడ్డి శనివారం మృతి చెందగా..విషయం తెలుసుకుని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.. అన్ని రకాలుగా అండగా నిలుస్తామని అభయమిచ్చారు.

# కాంగ్రెస్ మోసాలపై కదనభేరి!

## బీఆర్ఎస్ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు

గద్వాల ప్రతినిధి, ఆగస్టు 29, ప్రజా కలం:

కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు, 1000 రోజుల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు తెలిపారు. కేటీఆర్ పిలుపు మేరకు శనివారం గద్వాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో, ఇంకా ప్రజలకు ఏ హామీలు బాకీ ఉన్నాయో ఇంటింటికీ వెళ్లి వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టాల్సిన బాధ్యత బీఆర్ఎస్‌పై ఉందన్నారు. సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్. కేశవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు, జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 3న గైనకాలజీ స్పెషలిస్ట్ వైద్యుల ఎంపికకు వాక్-ఇన్-ఇంటర్వ్యూ. డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్

– ఖమ్మం, ఆగస్టు 29(ప్రజా కలం న్యూస్ )

తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలోని మధిర ఏరియా ఆసుపత్రిలో ప్రజలకు గైనకాలజీ వైద్య సేవలు రెండు నెలల కాలానికి (జాయిన్ అయిన తేదీ నుండి) తాత్కాలిక ప్రాతిపదికన అందించేందుకు సెప్టెంబర్ 3న ఉదయం 11 గంటలకు వాక్-ఇన్- ఇంటర్వ్యూ ద్వారా గైనకాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ ఒకరిని ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ కె. రాజశేఖర్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వైద్యునికి నెలకు లక్ష రూపాయల గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఎంబీబీఎస్‌తో పాటు ఎంఎస్ ఉత్తీర్ణులై ఉండాలని, సంబంధిత విభాగంలో అదనపు అర్హతలు, సాధారణ పని అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులు లేదా ఇతర ప్రభుత్వ వైద్య సంస్థల్లో గైనకాలజీ విభాగంలో పనిచేసిన అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నియామకాలు రెగ్యులర్, కాంట్రాక్ట్ లేదా ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీ కాదని, ప్రజల అత్యవసర వైద్య అవసరాల దృష్ట్యా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో కేవలం రెండు నెలల కాలానికి మాత్రమే తాత్కాలిక సేవల కోసం చేపడుతున్న చర్య అని స్పష్టం చేశారు. వాక్-ఇన్- ఇంటర్వ్యూ సెప్టెంబర్ 3న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఖమ్మం లోని జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం, మొదటి అంతస్తు, రూమ్ నంబర్ ఖీ-2లోని సూపరింటెండెంట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, గత ప్రభుత్వ సేవల అనుభవ ధృవపత్రాలు, రెండు సెట్ల అటెస్టెడ్ జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో నిర్ణీత తేదీ, సమయానికి నేరుగా వాక్-ఇన్- ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.పూర్తి వివరాలు, దరఖాస్తు నమూనా కోసం ఖమ్మం జిల్లా అధికారిక వెబ్సైటు https://khammam.telangana.gov.in ను సందర్శించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ ఆ ప్రకటనలో తెలిపారు.

# ఆదివాసీ హక్కులు, సంస్కృతి పరిరక్షణకు ఐక్య పోరాటం

## ఆళ్లపల్లిలో ఆదివాసీ రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమన్వయ సమితి మండల స్థాయి సమావేశం



ఆళ్లపల్లి, ఆగస్టు 29, ప్రజాకలం:

ఆళ్లపల్లి మండల పరిధిలోని మర్కోడు గ్రామంలోని శ్రీ రెక్కల రామక్క ప్రాంగణంలో శనివారం ఆదివాసీ రాజ్యాంగ హక్కులు మరియు సంస్కృతి-సాంప్రదాయాల పరిరక్షణ సమన్వయ సమితి ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఆళ్లపల్లి జేఏసీ కమిటీ అధ్యక్షులు పాయం రమేష్, కొమరం వెంకటకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ చందా లింగయ్య దొర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం భద్రాద్రి జిల్లా అధ్యక్షులు గొగ్గేల ఆర్కే దొర, ప్రధాన కార్యదర్శి కొమరం శ్రీను తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ చందా లింగయ్య దొర మాట్లాడుతూ ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడంతో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో అమలులో ఉన్న భూ బదలాయింపు నిషేధ చట్టం 1/70ను తొలగించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ఆదివాసీలు ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన 1,672 మంది గిరిజనేతరులు 1/70 చట్టానికి సంబంధించి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అలాగే ఐదో షెడ్యూల్ పరిధిలోని ఆదివాసీ ప్రాంతాలు, భూములు, రాజకీయ రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలపై హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పిటిషన్లు దాఖలైనట్లు తెలిపారు. గతంలో 1/70 చట్టాన్ని తొలగించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసే ప్రయత్నం విఫలమైనప్పటికీ, ప్రస్తుతం కోర్టుల ద్వారా చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఉద్దేశించిన జీఓ నంబర్ 3 విషయంలో ఆదివాసీ సంఘాలు, ఉద్యోగ-ఉపాధ్యాయ సంఘాలు, ప్రభుత్వం తగిన స్థాయిలో స్పందించకపోవడం వల్ల సమస్య ఏర్పడిందన్నారు.ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించేందుకు ఆదివాసీ సంఘాలు, ఉద్యోగ--ఉపాధ్యాయ సంఘాలు, ఆదివాసీ సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత, విద్యార్థులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరించేలా కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.మండల స్థాయి సమన్వయ కమిటీ ఎన్నికసమావేశం అనంతరం ఆళ్లపల్లి మండల స్థాయి సమన్వయ కమిటీని ఎన్నుకున్నారు.

ఆదివాసీ సంఘాల ప్రతినిధులు: పాయం రమేష్, కొమరం వెంకటకృష్ణ, గొగ్గల వినోద్, సాగబోయిన సురేష్, తుమ్మ నాగరాజు, కొమరం సతీష్, కొమరం సుధాకర్, ఈసం సాంబశివరావు.

ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు:
జోగ రాంబాబు, కొమరం లాలయ్య, కొమరం రాంబాబు, పాయం కృష్ణమూర్తి, గొగ్గల బాబు, కొమరం పాపారావు, సుతారి విజయ్, మద్దెల సూర్యకాంతం.

ఆళ్లపల్లి మండల సర్పంచుల సంఘం:వాసం సుస్మిత, పాయం రామనర్సయ్య, సుతారి రమాదేవి, కల్తీ వెంకటేశ్వర్లు, మోకాళ్ల చంద్రశేఖర్, ఊకే చిన పాపయ్య, తెల్లం సంధ్యారాణి, ఏదుల్లా శ్రావణి, ఈసం రుక్మిణి, వజ్జ ఉమా, పాయం సూర్యకాంతం.

పొలిటికల్ విభాగం:పడిగా సమ్మయ్య, పాయం నరసింహారావు, కొమరం సత్యనారాయణ, గొగ్గల వెంకటేశ్వర్లు, కొమరం హనుమంతు, బొమ్మల కనకరాజు, కొమరం లక్ష్మయ్య.

సమావేశానికి మండలంలోని సర్పంచులు, వివిధ ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ-ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గిడుగు జయంతి సందర్భంగా వ్యాసరచన పోటీలు

## తెలుగు భాషపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించడమే లక్ష్యం



ఆళ్లపల్లి, ఆగస్టు 29, ప్రజాకలం:

తెలుగు భాషా సంస్కర్త, వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని ఆళ్లపల్లి జిపిహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా వైభవాన్ని, గిడుగు వెంకట రామమూర్తి సేవలను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు, వారిలో రచనా నైపుణ్యాలను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని గిడుగు వెంకట రామమూర్తి జీవితం, తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేసిన విశిష్ట సేవలు, వ్యావహారిక భాషా ఉద్యమం, తెలుగు భాష ప్రాచీనత మరియు ఆధునిక సమాజంలో మాతృభాష ప్రాధాన్యత వంటి అంశాలపై వ్యాసాలు రచించారు. విద్యార్థులు తమ ఆలోచనలను సృజనాత్మకంగా వ్యక్తపరుస్తూ పోటీల్లో ప్రతిభ కనబరిచారు.గిడుగు వెంకట రామమూర్తి తెలుగు భాషను ప్రజలకు చేరువ చేయడంలో కీలక పాత్ర పోషించారని, గ్రాంథిక భాషకు బదులుగా సులభమైన వ్యావహారిక భాషను ప్రోత్సహించడం ద్వారా తెలుగు భాషా వికాసానికి విశేష కృషి చేశారని ఉపాధ్యాయులు వివరించారు. ఆయన ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.విద్యార్థుల్లో తెలుగు భాషపై ప్రేమాభిమానాలు పెంపొందించడంతో పాటు, చదవడం-రాయడం పట్ల ఆసక్తిని పెంచడం, సృజనాత్మకతను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బాలాజీ, వీరన్న, వెంకటేశ్వర్లు, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు త్వరలో ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

# ఆంజనేయస్వామిను దర్శించుకున్న జనసేన పార్టీ జిల్లా ఇన్‌చార్జి బాసు చిన్న తిమ్మప్ప



గద్వాల ప్రతినిధి ఆగస్టు 29 ప్రజా కలం:

జోగులాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండలం బీచుపల్లిలోని ప్రసిద్ధ శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని శనివారం గద్వాల జిల్లా జనసేన పార్టీ ఇన్‌చార్జి బాసు చిన్న తిమ్మప్ప ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రజలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, జిల్లా అభివృద్ధి సజావుగా సాగాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులతో కొద్దిసేపు ముచ్చటించి, ఆలయ విశేషాలను తెలుసుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు అందించారు. వీరి వెంట జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు: సైబర్ మోసాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత పాటిల్ అన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటో రియంలో జరిగిన సమావేశంలో జిల్లా ప్రజల భద్రత, అత్యవసర సేవలు, మహిళలు, చిన్న పిల్లలపై నేరాల నివారణ చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన పలు అవగా హన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణలో పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం, అవగాహన ఎంతో కీలకమన్నారు. చిన్నారుల భద్రత కోసం చైల్డ్ హెల్ప్‌లైన 1098, మహిళల రక్షణ కోసం డయల్ 112, 181, 1091ను సంప్రదించాలన్నారు. అలాగే సైబర్ నేరాలకు 1930 హెల్ప్‌లైనతో పాటు సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. సోష ల్ మీడియా సమస్యలపై సైబర్ మిత్ర 9121211100, సోషల్ మీడి యా సెల్ 9121101103ను, మత్తు పదార్థాల నియంత్రణకు 1972ను సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే మొబైల్ పోన అపహరణకు గురై నప్పుడు సీఈఐఆర్ పోర్టల్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ హుస్సేనపీరా, డీఎస్పీలు వెంకట్రామయ్య, వెంకట రమణ, దుర్గాప్రసాద్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# ఓటర్లు సహకరించాలి

కర్నూలు: పారదర్శక ఓటరు జాబితా రూపకల్పనకు ఓటర్లు సహకరించాలని కర్నూలు జిల్లా సర్ ఎలెక్టోరల్ అబ్జర్వర్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ లావణ్య వేణి సూచించారు. నగరంలోని పాతబస్తీ పెద్దమార్కెట్ వద్ద ప్రభుత్వ బాలికల పాఠశాలలో 248 పోలింగ్ బూతలో నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన డేను కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలుంటే తగిన ఆధారాలతో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఓటర్లకు సూచించారు. మృతులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, ఆచూకీ లేని వారు, డూప్లికేట్ ఓటర్లకు సంబంధించిన వివరాలను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటరు జాబితాలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండ చర్యలు తీసుకోవడం సర్ ప్రధాన ఉద్దేశమన్నారు. సర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత స్థాయి ఏజెంట్లు క్రియాశీలకంగా భాగస్వాములై ఓటరు జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందేందుకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఈఆర్ఓలు తహసీల్దారు రవికుమార్, డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ, కార్యదర్శి నాగరాజు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా మద్యం పాలసీ

కర్నూలు అర్బన్ ,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తెచ్చిన మద్యం పాలసీని పద్బందీగా అమలు చేయాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, రాష్ట్ర డైరెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ఎన్ఫోర్సుమెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మతో కలిసి ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం క్యాంప్‌సలో ఉన్న కెమికల్ ఎగ్జామినర్ ల్యాబ్‌ను పరిశీలించి నూతనంగా ఏర్పాటు చేసిన పరికరాల పని తీరును పరిశీలించారు. అనంతరం అక్కడి నుంచి కలెక్టరేట్ చేరుకుని నంద్యాల, కర్నూలు జిల్లాల ఎక్సైజ్ శాఖ అధికారులు, సీఐలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని నవోదయం అమలు తీరును ప్రశంసించారు. నాటు సారా తయారీ, అమ్మకాలను పూర్తిగా మానేసిన వారికి ప్రత్యేకంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న తీరును అభినందించారు. ఇంకా అలాంటి వారిని నాటు సారా తయారీకి దూరంగా ఉంచేందుకు జిల్లా యంత్రాంగంతో సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. కర్నూలు, కోడుమూరు, కోసిగి, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, కోవెలకుంట్ల ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ ఆదాయం తగ్గుదలకు గల కారణాలను విశ్లేషించారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాల: ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమ స్యలను పరిష్కరించాలని టీ జీఈజేసీ చైర్మన్ గడియారపు శ్రీహరి అన్నారు. టీఎన్‌జీవో కార్యాలయంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంచిర్యాల జిల్లా సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పెండింగ్‌లో ఉన్న ఆ ర్థిక ప్రయోజనాలు ప్రభుత్వం పరిష్కరించాలని, పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని, సీఏలను విడుదల చేయాలని తదితర డిమాండ్లతో పాటు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డి మాండ్ల సాధన కోసం సంఘాలన్ని ఐక్యంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో నాయకులు వనజరెడ్డి, శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

జైపూర్ : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యా దుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని మంచిర్యాల డీసీ పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు.ఆయన వార్షిక తనిఖీల్లో భా గంగా జైపూర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. అనంతరం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, సీఐ నవీన్, ఎస్ఐ భూమేష్‌లు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించి పోలీస్‌స్టేషన్ పరిసరాలను, పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వా హనాలను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉం చుకోవాలని సూచించారు. రిసెప్షన్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి, రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ రైటర్లతో మాట్లాడి, ఆన్‌లైన్‌లో కేసుల వివరాల నమోదు, అప్‌లోడ్ ప్రక్రియపై వివరాలు తెలుసకున్నారు పెండింగ్ కేసుల ఫైల్లు, క్రైం రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, పో లీస్ సిబ్బంది ఎళ్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని, శాంతిభద్రతల ప రిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధా లు పెంపొందించుకుంటూ సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవా లన్నారు. మత్తుపదార్థాల నిర్మూలను ప్రత్యేయ కృషి చేయాలన్నారు.


పదవీ విరమణ శుభాకాంక్షలు
గౌ॥ శ్రీ ఈదులపల్లి సాయిబాబ గారు
స్కూల్ అసిస్టెంట్ (జీవ శాస్త్రం) & ప్రధానోపాధ్యాయులు
మండల ప్రాథమికోన్నత పాఠశాల - మరికల్
మం॥ తిమ్మాజిపేట, జి॥ నాగర్‌కర్నూల్.
తేదీ: 31.08.2026
జె. జయవంత్ రావు
రికార్డ్ అసిస్టెంట్,
సమాచార మరియు పౌర సంబంధాల శాఖ
తెలంగాణ ప్రభుత్వం.



## మాతృభాషతోనే విలువల పరిరక్షణ.

కరీంనగర్ ప్రజాకలం ఆగష్టు 29.

మాతృభాషను సంరక్షించుకోవడం ద్వారానే సమాజంలో విలువలను పరిరక్షించగలమని ఇరుకుల్ల మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ శ్రవణ్ కుమార్ అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో టీఎల్ఎం మేళా, పుస్తక ప్రదర్శన నిర్వహించారు.

ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. జ్ఞానం కోసం ఇతర భాషలను నేర్చుకోవడంతో పాటు మాతృభాషపై పట్టు ఉండాలని సూచించారు. సాహిత్యం ద్వారా సమాజంలో విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించబడతాయని అన్నారు. గురజాడ అప్పారావు, శ్రీశ్రీ, కాళోజి, దాశరథి వంటి కవుల రచనలు ఉత్తమ మానవుని జీవితానికి దిశానిర్దేశం చేస్తాయని, విద్యార్థులు సాహిత్య అధ్యయనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ అకాడమిక్ కోఆర్డినేటర్ మెరాజ్, స్కూల్ కోఆర్డినేటర్ సురేష్, అధ్యాపకులు నాజియా, రాజు, శ్రీలత, అశోక్, ఉపాధ్యాయులు సతీష్, విష్ణు, శ్రీనివాస్, పవన్, షాజీయుద్దీన్, అస్రా, జ్యోతి, ఉదయ, ఫైజా, షాహెదా, వార్డెన్ ఫకృద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గుంతలమయమైన రహదారితో ప్రయాణికుల అవస్థలు



నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 29:

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్ మండల కేంద్రం బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఆర్మూర్ వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు బస్టాండ్ ప్రాంగణంలోకి వెళ్లే మార్గం గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇటీవల కురుస్తున్న వర్షాలతో రహదారిపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి బురదమయంగా మారుతోంది. బస్సులు గుంతల మీదుగా వెళ్లే సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గర్భిణీలు, వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు ఈ దారిలో ప్రయాణించేందుకు అవస్థలు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌కు నిత్యం అనేక మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండటంతో ఈ రహదారి పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. వర్షం సమయంలో గుంతలు నీటితో నిండిపోవడంతో అవి ఎంత లోతుగా ఉన్నాయో తెలియక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు. బస్టాండ్‌కు వెళ్లే దారి ఇంత అధ్వానంగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని పరిశీలించి, గుంతలను పూడ్చడంతో పాటు అవసరమైన చోట శాశ్వతంగా సీసీ రోడ్డు లేదా నాణ్యమైన రహదారి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా బస్టాండ్‌కు వచ్చే గర్భిణీలు, వృద్ధులు మరియు అత్యవసర ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అక్లూర్ జీపీలో 'ఎస్సీఆర్' నోటీసులపై ప్రత్యేక విచారణ అర్హులకు అన్యాయం జరగనివ్వం: జీపీవో స్వాతి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 29 :

వేల్పూర్ మండల పరిధిలోని అక్లూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఎస్సీఆర్ (SCR) నోటీసులపై ప్రత్యేక



హియరింగ్ (విచారణ) కార్యక్రమం నిర్వహించారు. నోటీసులు అందుకున్న స్థానికుల నుంచి వచ్చిన అభ్యంతరాలను, వారి వివరణలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీపీవో స్వాతి మాట్లాడుతూ.. చట్ట నిబంధనల ప్రకారం, పూర్తి పారదర్శకంగా ఈ విచారణ ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. అర్హులైన ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు. స్థానిక సర్పంచ్ జిన్నా జనార్ధన్, ఉపసర్పంచ్ సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలోని సమస్యల పరిష్కారానికి ప్రజలు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ వరలక్ష్మి, ఇతర బూత్ స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు

**అభివృద్ధి పనులు చేపట్టేందుకు పూర్తి సమాచార సేకరణ – గ్రామసభల్లో ప్రతిపాదనల రూపకల్పన – జిల్లాలో 335 గ్రామపంచాయతీలు**

ఆసిఫాబాద్ : పల్లెల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించింది. మూడేళ్ల కాలపరిమితితో గ్రామపంచాయతీల అభివృద్ధి కోసం అవసరమైన డేటా సేకరణ ప్రక్రియ ప్రారంభించింది. ఇప్పటికే ఒక ప్రత్యేకఫార్మాట్ అందజేశారు. ఇటీవల పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేపట్టాల్సిన చర్యలపై జిల్లా పంచాయతీ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్రాల బడ్జెట్ మాదిరిగా పంచాయతీ స్థాయిలో అదేవిధానం అమలుకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం తెలంగాణ గ్రామపంచాయతీ సమగ్రఅభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) కింద ప్రతీ గ్రామానికి ప్రత్యేక ప్రొఫైల్ తయారు చేస్తున్నారు. పంచాయతీలలో చేయాల్సిన అభివృద్ధిపనులు, ముందస్తు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. విద్య, వైద్య, అటవీ, రెవెన్యూ, పౌరసరఫరాలు, డీఆర్డీఏతో పాటు 17శాఖలతో సమావేశాలు నిర్వహించి, పల్లెల అవసరాలు తెలుసుకోనున్నారు. తద్వారా జిల్లాలోని 15మండలాల పరిధిలో 335గ్రామపంచాయతీలకు లబ్ధి చేకూరనుంది. గ్రామసభలు నిర్వహించి మండలాల వారీగా పనుల ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు కార్యాచరణ చేపడుతున్నారు. విలేజ్ ప్రొఫైల్ తయారైతే ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టే అవకాశం ఉంది. గ్రామ జనాభాకు అనుగుణంగా రోడ్లు, తాగునీరు, విద్య, వైద్య తదితర మౌలికవసతుల సదుపాయాలు మెరుగుపడనున్నాయి.

**యాప్‌లో సమగ్ర సమాచారం..**

గ్రామపంచాయతీల అభివృద్ధికి పంచాయతీరాజ్‌శాఖ ప్రత్యేకంగా యాప్ అందుబాటులోకి తేనుంది. గ్రామ ఆవిర్భావం, ప్రొఫైల్ నుంచి మూడేళ్లలో ఏం చేయాలి, ఎంత బడ్జెట్ అవసరం ఉంది.. ఏ శాఖ నుంచి ఎంత ఖర్చు చేస్తున్నారు.. అనే పూర్తి వివరాలను 39రకాల అంశాలతో డిజిటలైజ్ చేయనున్నారు. దీంతో ఒక్క క్లిక్‌తో గ్రామానికి సంబంధించిన సమగ్రసమాచారం అందుబాటులోకి రానుంది. స్థానిక వనరుల ఆధారంగా పల్లెల అభివృద్ధి సాధనతో పాటు నిధుల్లో అవినీతి అక్రమాలను నియంత్రించడం, ప్రతీపైసాకు లెక్క ఉండేలా ప్రణాళిక రచిస్తోంది. గ్రామసభల ద్వారా ప్రజల అవసరా లను గుర్తించి, మూడేళ్లలో గ్రామాభివృద్ధి చేపట్టడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీపంచాయతీలో నాలుగు గ్రామసభలు నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటికే జిల్లాలో ఈ ప్రక్రియ ప్రారంభమైంది.



**విలేజ్ ప్రొఫైల్..**

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను మూడు భాగాలుగా వర్గీకరించారు. మొదటి భాగంలో విలేజ్ ప్రొఫైల్ తయారు చేస్తున్నారు. ఇందులో గ్రామానికి సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేస్తారు. గ్రామం, విస్తీర్ణం, సరిహద్దులు, లొకేషన్, జనాభా, స్త్రీలు, పురుషులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంఖ్య, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, బిల్ కలెక్టర్, మల్టీపర్పస్ వర్కర్ల వివరాలు నమోదు చేయనున్నారు. సాగుభూమి, బోరుబావులు, కుంటలు చెరువులు, కాల్వలు, రహదారులు, వీధిదీపాలు, డ్రెయినేజీలు, హెల్త్ సబ్‌సెంటర్లు, బ్యాంకులు, రేషన్‌దుకాణాలు, వైకుంఠ ధామాలు, రైతువేదికలు, క్రీడాప్రాంగణాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, పశువైద్యశాలల వివరాలు నమోదు చేయనున్నారు. అలాగే పంచాయతీల ఆదాయం, కేంద్ర రాష్ట్రప్రభుత్వాల గ్రాంట్లు, ఆసరా పింఛన్లు, గతంలో ఖర్చు చేసిన వివరాలు అప్‌లోడ్ చేస్తారు.

## నిజామాబాద్‌లో ముమ్మరంగా 'పాంచజన్య సంకల్ప సభ' ఏర్పాట్లు: పరిశీలించిన డా.రఘు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 29:

తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఈ నెల 31న నిజామాబాద్ కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న 'పాంచజన్య సంకల్ప సభ' ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సభ విజయవంతం కోసం సభ పర్యవేక్షకులు,



కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డా. రఘు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఆయన శుక్ర, శనివారాల్లో వరుసగా సభా ప్రాంగణాన్ని సందర్శించి, ఏర్పాట్ల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మైదానంలో జరుగుతున్న వేదిక నిర్మాణం, సభకు వచ్చే ప్రజలకు కల్పించాల్సిన తాగునీరు, ఇతర సౌకర్యాలు, వాహనాల పార్కింగ్ స్థలాలు, నాయకులు--కార్యకర్తల రాకపోకలకు సంబంధించిన మార్గాలను ఆయన నిశితంగా పరిశీలించారు. అనంతరం స్థానిక నాయకులు, వివిధ నిర్వాహక కమిటీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రఘు మాట్లాడుతూ.. సభకు భారీ సంఖ్యలో జనం తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమయం తక్కువగా ఉన్నందున ప్రతి విభాగం పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పనులను మరింత వేగవంతం చేయాలని, పాంచజన్య సంకల్ప సభను ఘన విజయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# మీనాక్షి నటరాజన్ చేతులెత్తేసేరా?



హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా మాజీ ఎంపీ మీనాక్షి నటరాజన్‌ను ఏఐసీసీ నియమించినప్పుడు.. అధికారంలో ఉన్న పార్టీలో చెలరేగుతున్న ఆధిపత్య పోరును, అసమ్మతులను ఆమె అరికడతారని అధిష్టానం, పార్టీ కేడర్ భావించాయి. రాహుల్ గాంధీ బృందంలో అత్యంత కీలక సభ్యురాలిగా, సాదాసీదా జీవితం గడిపే అవినీతి రహిత నాయకురాలిగా ఆమెకున్న గుర్తింపు తెలంగాణలోని ముఠా రాజకీయాలను గాడిలో పెడుతుందని భావించారు. అయితే, ఆచరణలో తెలంగాణ కాంగ్రెస్ నేతల స్వయం ప్రతిపత్తి, వర్గ రాజకీయాల ముందు ఏఐసీసీ ప్లానింగ్ పూర్తిగా తేలిపోయిందనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గాంధీ భవన్ వేదికగా జరుగుతున్న ఆధిపత్య పోరును, ముఖ్యమంత్రి వర్గానికి, మిగిలిన సీనియర్ నేతలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను ప్రాథమిక దశలోనే పరిష్కరించడంలో మీనాక్షి నటరాజన్ వైఖరి అత్యంత మెతకగా ఉందనే అభిప్రాయం బలపడింది. విమర్శలు, వివాదాలు రచ్చకెక్కిన ప్రతిసారీ సమీక్షలు , అంతర్గత చర్చలు లేదా కమిటీల పేరుతో సమయాన్ని గడపడమే తప్ప .. పార్టీ క్రమశిక్షణను దాటిన బడా నేతలపై కఠిన చర్యలు తీసుకునే సాహసం ఆమె చేయలేకపోయారు. దీనివల్ల అసమ్మతి నేతలకు ఏఐసీసీ పట్ల భయం లేకుండా పోయిందనే టాక్ వినిపిస్తోంది. అసమ్మతి స్వరాలు పెరిగినప్పుడు రాజీ మార్గాలు వెతకడం వేరు, కఠిన నిర్ణయాలతో పార్టీ లైన్ దాటకుండా చేయడం వేరు. తెలంగాణ కాంగ్రెస్ సంస్కృతికి తగ్గట్లుగా కఠిన నిర్ణయాలు తీసుకోకపోవడమేఆమె వైఫల్యంగా కనిపిస్తోంది. తెలంగాణ కాంగ్రెస్‌లో సీఎం రేవంత్ రెడ్డికి ఉన్న పట్టు, అదే సమయంలో కేబినెట్ మంత్రులు, పాత తరం కాంగ్రెస్ నేతల నుంచి ఎదురవుతున్న తీవ్ర వ్యతిరేకతను సమన్వయం చేయడంలో ఇన్‌ఛార్జ్ వ్యవస్థ విఫలమైంది. ఒకవైపు మంత్రుల మధ్య అంతర్గత పోరు, కొండా సురేఖ ఎపిసోడ్ వంటి ఘటనలు మీడియా ముందుకు వచ్చి పార్టీ ప్రతిష్టను దిగజార్చుతున్నా.. కేవలం అధిష్టానానికి నివేదికలు పంపడానికే ఇన్‌ఛార్జ్ పరిమితమయ్యారనే కామెంట్లు వస్తున్నాయి. ఈ అంతర్గత బలహీనతల నడుమ, మధ్యప్రదేశ్‌లో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ దాఖలు చేయగా తెలంగాణలోని ఓ ప్రైవేట్ కేసు వివరాల వల్ల రిటర్నింగ్ ఆఫీసర్ నామినేషన్‌ను తిరస్కరించింది. ఆమె రాజకీయ జీవితంలో అతిపెద్ద ఎదురుదెబ్బగా మారింది. తెలంగాణ వంటి సంక్లిష్టమైన రాష్ట్రంలో గ్రూపు రాజకీయాలను నడిపించడంలో ఆమె అనుభవం సరిపోలేదనే సంకేతాలు పంపాయి. రాజ్యసభ అవకాశాన్ని కోల్పోవడం వల్ల ఢిల్లీ స్థాయిలోనూ, తెలంగాణ నేతల వద్ద కూడా ఆమె రాజకీయ పరపతి మరింత తగ్గిపోయిందనే విశ్లేషణలు సాగుతున్నాయి. కేవలం మంచి ఇమేజ్ , రాహుల్ గాంధీ ఆశీస్సులు మాత్రమే ప్రాంతీయంగా బలంగా ఉన్న వర్గ రాజకీయాలను నియంత్రించలేవు. తెలంగాణ కాంగ్రెస్ మరింత వివాదాల్లోకి వెళ్లకుండా ఉండాలంటే.. మీనాక్షి నటరాజన్ తన మెతక వైఖరి ని వీడి, శస్త్రచికిత్స తరహా కఠిన నిర్ణయాలు తీసుకోవడం లేదా అధిష్టానం ఒక పవర్‌ఫుల్ ప్రత్యామ్నాయ వ్యూహకర్తను రంగంలోకి దించడం తప్ప వేరే మార్గం కనిపించదని అంటున్నారు.

# ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో మాయాజాలం

పెద్దపల్లి : 'డిగ్రీ పూర్తయిందా? మా కళాశాలలో చేరండి.. తరగతులకు ప్రత్యేకంగా హాజరు కావాల్సిన అవసరం లేదు.. పరీక్షలు రాసుకోండి.. సర్టిఫికెట్ పొందండి.. ఉపాధ్యాయులను తీర్చిదిద్దాల్సిన బీఈడీ శిక్షణను కేవలం సర్టిఫికెట్ పొందే ప్రక్రియగా మార్చేశారనే విమర్శలు వస్తున్నాయి. బీఈడీ కోర్సులో విద్యా మనోవిజ్ఞానం, బోధనా పద్ధతులు, పాఠ్య ప్రణాళిక, ప్రాక్టికల్స్ కంప్యూటర్ పరిజ్ఞానం, పాఠశాలల్లో టీచింగ్ ప్రాక్టీస్ వంటి అంశాల్లో శిక్షణ అవసరం. ఇందుకోసం నిర్దేశిత హాజరు, తరగతులు, ప్రాక్టికల్స్ తప్పనిసరి. పెద్దపల్లి పట్టణంలోని ఒక బీఈడీ కళాశాలలో కన్వీనర్ కోటాలో ప్రవేశాలు, నిబంధనలకు మించి ఫీజుల వసూళ్లు, హాజరు అక్రమాలతో నడిపిస్తూ విద్యార్థులను మోసం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే తరగతులకు హాజరు కాకుండానే బీఈడీ పూర్తి చేసుకొనే వెసలుబాటు కల్పిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**అడ్మిషన్ నుంచి డిసర్టేషన్ వరకు అదనపు వసూళ్లు**

కౌన్సెలింగ్, రికార్డులు, యూనిఫాం, టీచింగ్ ప్రాక్టీస్, సహపాఠ్య కార్యక్రమాలు, డిసర్టేషన్ (పరిశోధనా గ్రంథం) తదితర పేర్లతో సాధారణ ఫీజులకు అదనంగా వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నాలుగో సెమిస్టర్ విద్యార్థుల నుంచి డిసర్టేషన్ పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ.3 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. విద్యార్థులు స్వయంగా రూపొందించాల్సిన డిసర్టేషన్ రికార్డులను గతంలో తయారు చేసిన వాటిలో పేర్లు, కవర్లు మార్చి అందిస్తున్నారనే ఆరోప ణలు వినిపిస్తున్నాయి. కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అర్హత కలిగిన అధ్యాపకులు, ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది ఉండాలి. అయితే అవసరమైన బోధనా సిబ్బంది అందుబాటులో లేరని సమాచారం. నిబంధనల ప్రకారం 17 మంది అధ్యాపకులు ఉండాలి. కానీ వాళ్లు రికార్డుల వరకే పరిమితం అని తెలుస్తున్నది. వారు విధులకు హాజరవు తున్నారా, వారి అర్హతలు, నియామక వివరాలు ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# రేసులో రాములమ్మ

**- మంత్రి పదవిపై విజయశాంతి పేరు తెరపైకి**

హైదరాబాద్ : కొండా సురేఖపై చర్యల చర్చ ఖాళీ అయ్యే స్థానంపై అధిష్టానం కసరత్తు బీసీ మహిళా కోటాలో విజయశాంతికి అవకాశం. మంత్రి కొండా సురేఖ వ్యవహారం కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనకు చేరిన నేపథ్యంలో తెలంగాణ రాజకీయాల్లో మంత్రి పదవిపై కొత్త చర్చ మొదలైంది. సురేఖను మంత్రివర్గం నుంచి తప్పిస్తే, ఆమె స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలనే దానిపై



కాంగ్రెస్ నాయకత్వం కసరత్తు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మహిళా ప్రాతినిధ్యం, సామాజిక సమీకరణాలు, పార్టీ విధేయత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బీసీ సామాజికవర్గానికి చెందిన సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్సీ విజయశాంతి పేరు ప్రధానంగా వినిపిస్తోంది. సురేఖ స్థానంలో బీసీ మహిళకు అవకాశం కల్పించే అంశాన్ని కాంగ్రెస్ అధిష్టానం పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండగా, విజయశాంతి తన అభ్యర్థిత్వాన్ని పార్టీ పెద్దల వద్ద వినిపిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# తెలుగు భాషా వికాసానికి సాంకేతికత తోడవ్వాలి

## -త్రిపుర గవర్నర్ ఎన్ ఇంద్రసేనా రెడ్డి




కూకట్ పల్లి, ఆగస్టు 29, ప్రజా కలం ప్రతినిధి: తెలుగు భాషా వికాసానికి సాంకేతికత తోడవ్వాలని, అలాగే స్వచ్ఛమైన తెలుగును కాపాడుకోవడం మనందరి బాధ్యత అని త్రిపుర గవర్నర్ ఎన్ ఇంద్రసేనా రెడ్డి సూచించారు. నాంపల్లిలోని ఆడిటోరియంలో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించిన మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కార ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా ఫాల్గొని మాట్లాడారు. ఆంధ్ర అసోసియేషన్, పూణె సలహాదారు టి వి శ్రీనివాస్ కు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తొలుత అందరికీ తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు తనకు అసెంబ్లీలో పరిచయమని, ఎవరి గురించైనా ఎదుటి వాళ్లు చెప్పినప్పుడు చాలా గొప్పగా ఉంటుందని, అటువంటి వంటి వ్యక్తి వెంకట కృష్ణారావు అన్నారు.

**వర్సిటీ ప్రత్యేక కార్యక్రమాలు అభినందనీయం:**

తెలుగు యూనివర్సిటీ, తెలుగు భాష విషయంలో వర్సిటీ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. కేవలం భాష మాత్రమే కాకుండా, సంస్కృతీ సంప్రదాయాలు, నృత్యాలు, డప్పుల కార్యక్రమాలతో మిగతా వర్సిటీల కన్నా ప్రత్యేకత చాటుతోందని కొనియాడారు. గతంలో ఉన్న గవర్నర్ నార్త్ ఈస్ట్ లో ఉన్న కల్చరల్ అసోసియేషన్లను తీసుకొచ్చి ఇక్కడ వాటి ఎదుగుదలకు కృషి చేశారని గుర్తు చేశారు. మిగతా దేశాలు, రాష్ట్రాలు, ప్రాంతాల్లో కూడా తెలుగు భాష వ్యాప్తికి కృషి వర్సిటీ కృషి అభినందనీయమని తెలిపారు. అలాగే టి వి శ్రీనివాస్ కు ఈ పురస్కారం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అయితే సాంకేతికత వినియోగంలో తెలుగు యూనివర్సిటీ ఇంకా సాధించాల్సిన అవసరం ఉందని ఇంద్రసేనా రెడ్డి సూచించారు. తరగతి భోదన బట్టీపట్టే పద్ధతిలో కాకుండా, అనుభవ పూర్వకంగా ఉండాలన్నారు. ఆ దిశగా వర్సిటీ ఆలోచించాలని అన్నారు.

**ఇంగ్లీష్ పదాలు లేని తెలుగుపై పోటీలు:**

శ్రీనివాస్ మాటల్లో సిగ్గు, బిడియం వంటి పదాలు ఉన్నాయని, వాస్తవానికి అవన్నీతనకు వర్తిస్తాయని చమత్కరించారు. వారంతా స్పష్టంగా తాను తెలుగులో మాట్లాడలేనని అన్నారు. మొత్తంగా ఆయన ప్రసంగంలో కేవలం 3 పదాలు మాత్రమే ఇంగ్లిషువి ఉన్నాయన్నారు. అది నిజంగా గొప్ప విషయమన్నారు. ఆ రకంగా మాట్లాడాలని పోటీలు కూడా పెట్టాలని సూచించారు. వేరే భాషా పదాలు రాకుండా కొన్ని నిమిషాలు మాట్లాడాలని పోటీలు పెట్టడం వల్ల చాలా లాభం ఉంటుందని పేర్కొన్నారు. ఇంత స్వచ్ఛంగా తెలుగు భాష మాట్లాడతారు కాబట్టే శ్రీనివాస్ ఈ పురస్కారానికి అర్హులు అన్నారు. తనకు భాష మీద ప్రత్యేక అభిమానం ఉన్నప్పటికీ, సబ్జెక్ట్ దగ్గరకు వచ్చేసరికి మిగతా పదాలన్నీ వస్తాయని అన్నారు.

**తెలుగుకు తగ్గిన ప్రాముఖ్యత:**

స్వాత్రంత్యం వచ్చిన తర్వాత భాష సంయుక్త రాష్ట్రాలు ఏర్పడితే, అందరూ ఒక్కటిగా ఉంటారని ఆలోచన ఉండేదని, కానీ కొన్ని భాషలను ఆయా రాష్ట్రాలు బలవంతంగా కిల్ చేశాయని తెలిపారు. ఉదాహరణకు ఇక్కడి నుంచి సూరత్, బొంబాయి, పుణా వెళ్లిన వాళు అక్కడ తెలుగు పాఠశాలలు పెట్టుకున్నారని, అలాగే బయట నుంచి వచ్చిన వాళ్లు ఇక్కడ ఆయా భాషల పాఠశాలలు పెట్టుకున్నారని తెలిపారు. ఈరోజు అక్కడున్న స్కూళలో తప్పనిసరిగా లోకల్ భాష నేర్చుకోవాలన్నా ఆంక్షలతో తెలుగుకు ప్రాముఖ్యత తగ్గిందన్నారు. ఒకప్పుడు మా భాష ఉండాలి, మా భాష సంస్కృతి ఉండాలనే ఆలోచన ఉండేదని, ఇప్పుడు అటువంటి ఆలోచన లేదన్నారు.

**ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం అవసరం:**

విద్యార్థులకు ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, కేస్ స్టడీస్, ఇండస్ట్రీ ఇంటనెన్సిప్, నూతన విద్యాబోధనలు వంటి నూతన పోకడలను తెలుగు వర్సిటీ అనుకరించాలని సూచించారు. విద్య అంటే సాధారణ డిగ్రీలా కాకుండా, అనుభవ పూర్వకంగా ఉండాలనే ఉద్దేశంతో మోదీ ప్రభుత్వం నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకొచ్చిందన్నారు. డిజిటల్ విద్య అవసరం అని గుర్తించాలన్నారు. అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చెబితే అది 100 శాతం కరెక్ట్ అనే ఆలోచన తప్పు అన్నారు. కొన్ని సార్లు సంతకం రాని వారికి కూడా డాక్టరేట్ ఇస్తామని, అది ఆయనకు ఉన్న ప్రత్యేకమైన క్వాలిటీకి లభించిన గుర్తింపు అన్నారు. మోదీ ప్రభుత్వం వచ్చాక పద్మశ్రీ వంటి బిరుదుల కేటాయింపులో కూడా ప్రత్యేక గుర్తింపు ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. పురస్కార గ్రహీత శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి తరానికి, రాబోయే తరానికి తెలుగు భాషా సంస్కృతులను, వాటి మహోన్నత వైభవాన్ని పరిచయం చేస్తున్న సురవరం తెలుగు విశ్వవిద్యాలయానికి అభినందనలు తెలిపారు. తనను పురస్కారానికి ఎంపిక చేసినందుకు అభివాదాలు అన్నారు.

ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా వర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానంద రావు వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా ఏపీ శాసనసభ్యులు డా మండలి బుద్ధప్రసాద్, తెలంగాణ ప్రభుత్వం పూర్వ సలహాదారులు డా కె వి రమణాచారి పాల్గొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంత రావు స్వాగతోపాన్యాసం చేశారు. డైరెక్టర్ ఆచార్య బి హెచ్ పద్మప్రియ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## నాగరిగారి వసంతరాణి మృతి పట్ల నందిగామ నర్సింహా సంతాపం తెలిపిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహా



మహేశ్వరం, ఆగస్టు 29 (ప్రజా కలం): ప్రీతం నాగరిగారి తల్లి నాగరిగారి వసంతరాణి మృతి చెందారన్న వార్త తెలిసి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం చెంగిచెర్లలోని వారి నివాసానికి వెళ్లిన నందిగామ నర్సింహా, వసంతరాణి గారి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వసంతరాణి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ఆయన ప్రార్థించారు.

# డాక్టర్ సుల్తాన ఉమర్‌కు సన్మానం

### - డాక్టరేట్, సేవారత్న అవార్డు, బంగారు పతకం అందుకోవడం అభినందనీయం. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్.

దుబ్బాక ప్రజాకలం ఆగష్టు 29. నిరుపేదలు, అనాథలు, అభాగ్యులకు అండగా నిలుస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డా. మహమ్మద్ సుల్తాన ఉమర్‌కు న్యూ లైఫ్ థియాలాజికల్ యూనివర్సిటీ డాక్టరేట్‌తో పాటు మదర్ థెరిసా సేవారత్న అవార్డు, బంగారు పతకం లభించడం అభినందనీయమని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ అన్నారు. శనివారం డా.సుల్తాన ఉమర్ నివాసంలో ఆమెను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పేదలు, అనాథలు, నిరాశ్రయ కుటుంబాలకు సహాయం అందిస్తూ




సామాజిక సేవలో ముందుండటం అభినందనీయమన్నారు.

ఆమెకు లభించిన గౌరవాలు సామాజిక సేవకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నామని తెలిపారు. మానవతా దృక్పథంతో కొనసాగిస్తున్న సేవలు నేటి తరానికి, ముఖ్యంగా మహిళలకు స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంతరావుపల్లి ఉపసర్పంచ్ బైరం రమేష్, నాయకులు సతీష్, గణేష్, దాసరి హరిబాబు, ధార మల్లేష్, పుట్ట రాజు, గద్ద నరేష్, బాలకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల వినూత్న ఆవిష్కరణకు ప్రశంసల వెల్లువ

### భారతీయ--పాశ్చాత్య పద్ధతుల సమ్మేళనంతో మరుగుదొడ్డి బేసిన్ రూపకల్పన.

దుబ్బాక ప్రజాకలం ఆగష్టు 29. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం కొత్తపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాల విద్యార్థులు రూపొందించిన భారతీయ--పాశ్చాత్య సమ్మిళిత మరుగుదొడ్డి నీటి తొట్టి వినూత్న నమూనా అందరి ప్రశంసలు అందుకుంటోంది.



భారతీయ, పాశ్చాత్య మరుగుదొడ్డి విధానాలను ఒకే నీటి తొట్టిలో ఉపయోగించుకునేలా విద్యార్థులు ఈ నమూనాను రూపొందించారు. గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ సమ్మిళిత నీటి తొట్టి ద్వారా స్థలాన్ని ఆదా చేయడంతో పాటు నిర్మాణ వ్యయాన్ని తగ్గించవచ్చని విద్యార్థులు తెలిపారు. రైల్వేలు, విమానాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, ప్రజా ప్రదేశాలు, గృహాల్లో దీనిని వినియోగించవచ్చని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును 4వ తరగతి విద్యార్థిని మన్నె లతిక ప్రియ, 5వ తరగతి విద్యార్థిని శ్రావణి రూపొందించగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. నాగరాజు మార్గదర్శకత్వం వహించారు. విద్యార్థులు సమాజ అవసరాలను గుర్తించి వినూత్న పరిష్కారాలను రూపొందించడం అభినందనీయమని ఉపాధ్యాయులు, గ్రామస్థులు ప్రశంసించారు.

## డీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపికకు సంఘటన్ సృజన్ అభియాన్

### - క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకే ప్రాధాన్యత - ఏఐసీసీ కార్యదర్శి పి.వి. మోహన్







మహేశ్వరం, ఆగస్టు 29 (ప్రజా కలం): రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా ఏఐసీసీ సూచనల మేరకు సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ కార్యదర్శి మరియు రంగారెడ్డి జిల్లా అబ్జర్వర్ పి.వి. మోహన్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో, మహేశ్వరం నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పాల్గొనగా, మల్లాపూర్ లోని వై ఏ ఆర్ గార్డెన్ లో మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సంస్థాగత సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.వి. మోహన్ మాట్లాడుతూ.. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ నాయకత్వం, ఆలోచనలు మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమన్నారు. పార్టీ కామ్‌దార్ నైతికత లక్ష్యం వ్యూహం అనే స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేస్తూ, ప్రజలకు చేరువైన సమర్థవంతమైన నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. పార్టీ కోసం నిరంతరం పనిచేసే కామ్‌దార్, ప్రజాసేవలో నైతికత, కాంగ్రెస్ సిద్ధాంతాలపై స్పష్టమైన లక్ష్యం, ఎన్నికలు మరియు సంస్థాగత నిర్మాణంపై సమర్థవంతమైన వ్యూహం కలిగిన నాయకత్వం ద్వారానే పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, అందరినీ కలుపుకుని ముందుకు సాగడమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలని తెలిపారు. సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని మరింత పటిష్టం చేసి, ప్రజలతో నిరంతరం అనుసంధానమైన బలమైన సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యమన్నారు. డీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపికలో క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు పూర్తి ప్రాధాన్యత ఇస్తామని, పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపించే, అందరినీ కలుపుకుని పనిచేసే, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే నాయకత్వాన్ని పారదర్శకమైన విధానంలో ఎంపిక చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు, డీసీసీ అధ్యక్ష పదవి కోసం పోటీలో ఉన్న అభ్యర్థులు పాల్గొని తమ అభిప్రాయాలు, పార్టీ అభివృద్ధికి సంబంధించిన సూచనలు తెలియజేశారు. ఈ సమావేశంలో మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

## వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య.

వలిగొండ ఆగస్టు 29 ప్రజాకలం:వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కంచనపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంచనపల్లి గ్రామానికి చెందిన కొలిచెలిమి అశ్విని (27) అనే వివాహిత శనివారం ఉదయం కంచనపల్లిలోని అత్తగారి ఇంట్లో బెడ్రూంలో ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్యానికి పాల్పడింది.బెడ్రూంలో శబ్దం వినికిడిని విన్న కుటుంబ సభ్యులు దర్వాజలను బద్దలుకొట్టి చూడగా ఫ్యాన్కు వేలాడుతుండడాన్ని గమనించి కిందకి దించి హుటాహుటిన మండల కేంద్రంలోని ఒక ప్రైవేటు దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచేందినట్లు వైద్యులు నిర్ధారించడంతో మృతదేహాన్ని కంచనపల్లికి తీసుకొచ్చారు. ఆత్మహత్య ఘటనపై సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతురాలి శవానికి పంచనామ నిర్వహించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. భువనగిరి మండలంలోని తాజ్పూర్ గ్రామానికి చెందిన అశ్వినికి 2022 వ సంతవ్సరంలో కంచనపల్లి గ్రామానికి చెందిన కొలిచెల్మి మహేష్తో వివాహం జరిగిందని, వీరికి రెండున్నర సంవత్సరాల బాబు,ఒక సంవత్సరం పాప ఉన్నట్లు తెలిపారు. మృతురాలు ప్రస్తుతం చౌటుప్పల్ మండలంలోని మల్కాపురం వైద్య ఆరోగ్య శాఖలో ఎంఎలెచ్పీగా ఉద్యోగం చేస్తున్న ఈమేను అత్తగారి కుటుంబ సభ్యులు గత కొంతకాలంగా వరకట్నం కోసం ఇబ్బంది పెడుతున్నారని తల్లిదండ్రులతో వాపోయిందని పోలీసులు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతురాలి భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.



## రోస్టర్ విధానం సవరించాలి

### ర్యాకం శ్రీరాములు.

### హలో మాల.. ఛలో సెక్రటేరియట్.

దుబ్బాక ప్రజాకలం ఆగస్టు 29.

మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని నివారించి, రోస్టర్ విధానాన్ని సవరించాలని జాతీయ మాలమహానాడు పొలిట్ బ్యూరో ఛైర్మన్ ర్యాకం శ్రీరాములు డిమాండ్ చేశారు.



శనివారం రాయపోల్ మండల కేంద్రంలో 'హలో మాల.. ఛలో సెక్రటేరియట్' ముట్టడి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, ఉద్యోగ రంగాల్లో మాలలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ నెల 31న సోమవారం నిర్వహించే సెక్రటేరియట్ ముట్టడికి మాలలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల యాదగిరి, మద్దెల చంద్రం, కరికే పర్షరాములు, రాంపల్లి సతీష్, నవీన్, అజయ్, భానుప్రసాద్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

### మహిళల గౌరవం..భద్రతే

## సమాజ ప్రగతికి పునాది..

### -రాఖీ వేడుకల్లో నీలం మధుకు మహిళల ఆత్మీయత..

పటాన్చేరు, ఆగస్టు 29 (ప్రజా కలం) ప్రతినిధి

అన్నాచెల్లెళ్ల ఆత్మీయ బంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు పటాన్చేరులో ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నీలం మధు ముదిరాజ్ నివాసానికి పలువురు మహిళలు చేరుకుని ఆయనకు



రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. నీలం మధు ముదిరాజ్ వారికి మిఠాయిలు అందించి ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టే పండుగ కాదని, అన్నాచెల్లెళ్ల ప్రేమ, నమ్మకం, ఆప్యాయత, బాధ్యతలకు ప్రతీక అని తెలిపారు. ప్రతి మహిళ గౌరవంగా, భద్రంగా జీవించే వాతావరణం కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతి, సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, మహిళల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని నీలం మధు ముదిరాజ్ స్పష్టం చేశారు. సోదరభావం, సామాజిక ఐక్యతను పెంపొందించే రక్షాబంధన్ వంటి పండుగలు ప్రజలను మరింత దగ్గర చేస్తాయని తెలిపారు..

# దూరం పెరిగినా చెదరని భక్తి

### ఈ శ్రావణంలో 52 ఆలయాల్లో 1.73 లక్షల ఓంకారేశ్వర్‌లో పూజకు శ్రీ మందిర్ యాప్ వారధి

హైదరాబాద్,
ఆగస్టు 29 (ప్రజా కలం ప్రతినిధి)

జ్యోతిర్లింగం ఇప్పటికీ ఓంకారేశ్వర్ లోనే ఉంది. తరతరాలుగా అర్చకులు ఎక్కడ నిలబడి పూజలు నిర్వహిస్తున్నారో, ఇప్పటికీ అక్కడే ఆ సంప్రదాయం కొనసాగుతోంది. కానీ ఈ శ్రావణంలో ఆ రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తుడు పుణెలోని ఒక ఫ్లాట్‌లోనో, ఢిల్లీలోని ఒక ఇంట్లోనో, లేదా భారతదేశానికి వేల కిలోమీటర్ల దూరంలో విదేశాల్లోనో కూర్చుని ఉండవచ్చు. భారతదేశంలో అతిపెద్ద భక్తి వేదిక అయిన శ్రీ మందిర్ యాప్ ద్వారా ఆ పూజలో భాగమై ఉండవచ్చు.

భక్తి మారలేదు. శ్రావణం ఇప్పటికీ అదే. శివాలయ దర్శనం, రుద్రాభిషేకం, జలం, బిల్వపత్రం సమర్పించడం, మంత్ర జపం, సేవ వంటి ఆచారాలను భక్తులు తరతరాలుగా పాటిస్తూనే ఉన్నారు. భక్తుడికి, ఆలయానికి మధ్య ఎంత దూరం ఉన్నా, వారిని కలిపే మార్గాన్ని శ్రీ మందిర్ యాప్ కల్పించింది. ఈ శ్రావణంలో ఆ అనుబంధం కనిపించిన స్థాయి, ఈ రంగంలో ఇప్పటివరకు కనిపించిన అతిపెద్ద స్థాయిలలో ఒకటిగా నిలిచింది.

ఇక్కడ సాంకేతికత ఏ సంప్రదాయాన్నీ భర్తీ చేయడం లేదు, అదే సంప్రదాయంతో పాటు నడుస్తోంది. మహారాష్ట్రలో ఉన్న ఒక భక్తుడికి ఓంకారేశ్వర్‌లో జరిగే పూజలో పాల్గొనే అవకాశం కల్పిస్తోంది. శ్రావణంలో ప్రయాణించలేని వ్యక్తికి కూడా పూజలో భాగమయ్యే మార్గాన్ని ఇస్తోంది. విదేశాల్లో నివసిస్తున్న భారతీయుడు స్వదేశంలోని ఆలయంతో తన అనుబంధాన్ని కొనసాగించేందుకు తోడ్పడుతోంది. అర్చకుడు, పూజ, ఆలయం అన్నీ ఎప్పటిలాగే అక్కడే ఉన్నాయి. భక్తుడి ఆశ, భక్తి అక్కడికి చేరే దారిని




మాత్రమే శ్రీ మందిర్ యాప్ నిర్మించింది.

ఈ శ్రావణంలోని గణాంకాలు ఆ అనుబంధం ఎంత విస్తృతంగా ఉందో చూపిస్తున్నాయి. శ్రీ మందిర్ యాప్ ద్వారా సుమారు 1,73,222 మంది భక్తులు 52 ఆలయాల్లో జరిగిన 385 పూజల్లో పాల్గొన్నారు. మరో 64,388 మంది భక్తులు 12 ఆలయాల్లో 1.21 లక్షలకు పైగా దక్షిణ సమర్పించారు. సేవలోనూ పెద్ద ఎత్తున భాగస్వామ్యం కనిపించింది. 700 ఖిచ్డీ సేవ సమర్పణల ద్వారా 3,000 కిలోల ఖిచ్డీని భక్తులకు వడ్డించారు. సనాతన ధర్మంలో అన్నదానాన్ని అత్యున్నత దానాల్లో ఒకటిగా భావిస్తారు. శ్రీ మందిర్ యాప్ ఖిచ్డీ సేవ కూడా ఈ విశ్వాసంపైనే ఆధారపడి ఉంది. భక్తుడి సేవా సంకల్పాన్ని నేరుగా ప్రజలకు ఆహారం అందించే కార్యంగా మార్చడం దీని ఉద్దేశం. ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగంలో నాలుగు శ్రావణ సోమవారాల్లో 40 లక్షల మహామృత్యుంజయ మంత్ర జపంతో పాటు నర్మదా జల రుద్రాభిషేకం జరిగింది. ముఖ్యంగా, ఈ శ్రావణంలో 25,000 మందికి పైగా వృద్ధ భక్తులు యాప్ ద్వారా పూజల్లో పాల్గొని, దక్షిణ సమర్పించారు. స్వయంగా ప్రయాణించకుండానే తమకు నచ్చిన ఆలయంతో అనుబంధాన్ని కొనసాగించేందుకు ఇది వారికి ఒక మార్గంగా నిలిచింది.

భక్తులు ఎంచుకున్న ఆచారాలు మాత్రం పూర్తిగా సంప్రదాయబద్ధంగానే ఉన్నాయి. జలం, బిల్వపత్రం, ఉమ్మెత్త అత్యధికంగా సమర్పించిన వాటిలో ఉన్నాయి. పూజల్లో రుద్రాభిషేకం నుంచి పెద్ద ఎత్తున నిర్వహించిన మంత్ర జపాల వరకు ఉన్నాయి. ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రాప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ రాష్ట్రాల్లో భక్తులకు సమీపంలో ఆలయాలకు కొదవ లేదు. అయినప్పటికీ చాలామంది శ్రీ మందిర్ యాప్ ద్వారా ప్రత్యేకంగా ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగం, సోమేశ్వర్ మహాదేవ్ ఆలయం, పశుపతినాథ్ మహాదేవ్ ఆలయాలతో అనుసంధానం కావడాన్ని ఎంచుకున్నారు.

శ్రీ మందిర్ యాప్ వ్యవస్థాపకుడు, సీఈఓ ప్రశాంత్ సచాన్ దీనిని విశ్వాసంలో వచ్చిన మార్పుగా కాకుండా, ఆలయాన్ని చేరుకునే అవకాశంలో వచ్చిన మార్పుగా చూస్తున్నారు. ఆయన మాట్లాడుతూ, "శ్రావణంలో ప్రజలు పాటించే సంప్రదాయాలు మారడం లేదు. మారుతున్నది వాటిని చేరుకునే అవకాశం. ఒక భక్తుడికి వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలయంతో గాఢమైన అనుబంధం ఉండవచ్చు, లేదా అక్కడికి ప్రయాణించడం సాధ్యం కాకపోవచ్చు. సాంకేతికత ఆ దూరాన్ని తగ్గించడంలో సహాయపడగలదు. పూజ, అర్చకుడు, సంప్రదాయాలు ఎప్పటిలాగే ఆలయంలోనే కొనసాగుతాయి." ఈ ఏడాది శ్రావణం, ఇలాంటి అనుబంధం ఎంత పెద్ద స్థాయిలో సాధ్యమవుతుందో చూపించింది. శ్రీ మందిర్ యాప్ ఈ అనుబంధం ఎంత విస్తృత స్థాయికి చేరిందో చూపిస్తోంది. భక్తి, సాంకేతికత కలిసి భక్తుల ఆశను ఆలయానికి చేరుస్తున్నాయి. ముఖ్యంగా ప్రయాణం చేయలేకపోవడం వల్ల ఇలాంటి అనుభవానికి దూరమయ్యే అవకాశం ఉన్న వృద్ధ భక్తులకు ఇది మరో మార్గాన్ని అందించింది. ఆచారంలో ఎలాంటి మార్పు లేదు. మార్పు ఒక్కటే. భక్తుడు ఆలయానికి ఎంత దూరంలో ఉన్నా, దానితో అనుబంధాన్ని కొనసాగించగల అవకాశం ఇప్పుడు ఉంది.

## రసాయన పరిశోధనలో కిరణ్ కుమార్ ఘనత

### -ఫావిపిరావిర్ తయారీ విధానంపై పరిశోధనతో పీహెచ్‌డీ సాధన..



పటాన్చెరు, ఆగస్టు 29 (ప్రజా కలం) ప్రతినిధి

నూతన ఔషధ సమ్మేళనాల అభివృద్ధితో పాటు ఫావిపిరావిర్ తయారీకి మెరుగైన విధానాన్ని రూపొందించిన గీతం.. హైదరాబాద్ పరిశోధక విద్యార్థి వున్నం కిరణ్ కుమార్ రసాయన శాస్త్రంలో డాక్టరేట్‌కు అర్హత సాధించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగంలో ఎస్-బినోల్ ఫాస్ఫేట్, 2,4-థయాజోలిడిన్ డయోన్ ఉత్పన్నాల సంశ్లేషణ, జీవక్రియాశీలత,ఫావిపిరావిర్ తయారీ విధాన అభివృద్ధిపై పరిశోధన చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఆయన పరిశోధనకు సహాయ ఆచార్యురాలు డాక్టర్ కనకదుర్గా భాస్కర్ యమాజాల మార్గదర్శకత్వం వహించారు. పరిశోధనలో యాంటీ బ్యాక్టీరియల్,యాంటీ డయాబెటిక్,యాంటీ క్యాన్సర్ లక్షణాలు కలిగిన నూతన సమ్మేళనాలను గుర్తించినట్టు తెలిపారు.ఈ పరిశోధన భవిష్యత్ ఔషధాల అభివృద్ధి, వైద్య పరిశోధనలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కిరణ్ కుమార్ డాక్టరేట్ సాధించడంపై గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం. రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు..

### రావిర్యాల రైతులను నట్టేట ముంచిన

# నక్షా బాట వివాదం

### - సర్వే నెం.289 లోని పురాతన బాటను ధ్వంసం
### - పొలాలకు వెళ్లలేక కొంగర ఖుర్దు రైతుల ఆందోళన
### - జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని నక్షా బాటను పునరుద్ధరించాలని రైతుల వినతి



మహేశ్వరం, ఆగస్టు 29,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కొంగరకుర్దు గ్రామంలో రైతుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పురాతన కాలం నుండి రైతులు ఉపయోగిస్తున్న నక్షా బాటను గుర్తించలేని విధంగా ధ్వంసం చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గ్రామానికి చెందిన రైతులకు సర్వే నంబర్లు 295, 294, 296, 297, 497, 28, 498 లలో వ్యవసాయ భూములు ఉన్నాయి. ఈ భూములకు వెళ్లడానికి సర్వే నంబర్ 289 గుండా వెళ్లే నక్షా బాటను ఎన్నో ఏళ్లుగా రైతులు ఉపయోగిస్తున్నారు. ఈ బాట ద్వారా ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు, పశువుల రాకపోకలు సులువుగా సాగేవి. అయితే ఇటీవల సర్వే నంబర్లు 291 మరియు 292 లో భూములు కొనుగోలు చేసిన వ్యక్తులు ఆ బాటను చదును చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. అనంతరం ఆ బాటపై ఎవరో కంప్లైంట్ ఇచ్చారనే సాకుతో రెవెన్యూ అధికారులు ఏకంగా ఆ పురాతన నక్షా బాటను పూర్తిగా ధ్వంసం చేశారని బాధిత రైతులు వాపోతున్నారు.బాట ధ్వంసం కావడంతో ప్రస్తుతం తమ పొలాల్లోకి వెళ్లడానికి దారి లేకుండా పోయిందని, తమ పొలాల్లో ఉన్న బర్రెలు,ఇతర పశువులకు గడ్డి తీసుకెళ్లడానికి, వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్లు, ఇతర వాహనాలు తీసుకెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించాలని రైతులు కోరుతున్నారు. రెవెన్యూ రికార్డులు, పాత నక్షా మరియు క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించి, పురాతన కాలం నుండి ఉన్న నక్షా బాటను గుర్తించి,దానిని పునరుద్ధరించి రైతుల రాకపోకలకు శాశ్వతంగా అందుబాటులోకి తేవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులతో స్థల పరిశీలన జరిపి తక్షణ పరిష్కారం చూపాలని కొంగరకుర్దు గ్రామ బాధిత రైతులు వేడుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో అలేటి బావయ్య, కోటగళ్ళ రాజ్ కుమార్, కోటగళ్ల బాల్ రాజ్,నిమ్మ దామోదర్ రెడ్డి,రైతులు తదితరులు పాల్గొన్నారు.






## అమీన్పూర్ కోకా కోలా కంపెనీ యూనియన్ ఎన్నికల్లో హెచ్ఎంఎస్ ఘన విజయం

### కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటా: వి. శ్రీనివాస్ రెడ్డి

ముషీరాబాద్ ఆగస్టు 29 (ప్రజా కలం ప్రతినిధి)

అమీన్పూర్‌లోని కోకా కోలా కంపెనీ యూనియన్ ఎన్నికల్లో హెచ్ఎంఎస్ ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ మరియు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. దివంగత కార్మిక నేత నాయిని నరసింహారెడ్డి కార్మికుల సంక్షేమం కోసం చేసిన సేవలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి యూనియన్ ఎన్నికల్లో విజయం అందించిన కార్మికులు, ఉద్యోగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, వారికి న్యాయం జరిగేలా శక్తివంచన లేకుండా పనిచేస్తానని స్పష్టం చేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం యూనియన్ తరపున నిరంతరం పోరాడుతామని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# మిస్ గ్రాండ్ తెలంగాణ 2026 ఫస్ట్ రన్నర్-అప్‌గా రోహిణి కనక

**రోహిణి కనక ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ విద్యార్థిని**

**కుమారి రోహిణి కనక కి మిస్ గ్రాండ్ తెలంగాణ 2026**

**- ఫస్ట్ రన్నర్-అప్ అనే ప్రతిష్ఠాత్మక బిరుదు**

**బోడుప్పల్ శ్రీనివాస్ నగర్ కాలనీ అసోసియేషన్ ఘనసత్కారం**






హైదరాబాద్ ఆగస్టు 29(ప్రజాకలం న్యూస్)

ఇలాహే మోడలింగ్ అండ్ ఫినిషింగ్ స్కూల్ ఆధ్వర్యంలో మిస్ భారతి జెర్రీ, స్టేట్ డైరెక్టర్ -- మిస్ గ్రాండ్ తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో మిస్ గ్రాండ్ తెలంగాణ 2026 ఫస్ట్ రన్నర్-అప్‌గా రోహిణి కనక నిలిచారు. ఈ గ్రాండ్ ఫినాలే కార్యక్రమం 2026 ఫిబ్రవరి 7వ తేదీ శనివారం గాలా రిట్రీట్,రాందాస్‌పల్లి,హైదరాబాద్, తెలంగాణలో ఘనంగా జరిగింది. రోహిణి సాధించిన ఈ ఘనత తెలంగాణ రాష్ట్రానికి ఎంతో గర్వకారణంగా నిలిచింది. అనేక ప్రతిభావంతమైన పోటీదారుల మధ్య రోహిణి తన ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం, మేధస్సు, ఆకట్టుకునే స్టేజ్ ప్రెజెన్స్ ప్రత్యేకంగా నిలిచింది. ఇలాహే మోడలింగ్ అండ్ ఫినిషింగ్ స్కూల్ నిర్వహించే ఈ పోటీ, యువతులను ఆత్మవిశ్వాసంతో కూడిన నాయకులుగా ఆదర్శప్రాయ వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో ప్రసిద్ధి చెందింది. కుమారి రోహిణి కనక,జయప్రకాశ్, సవరప్ప,భారతిల కుమార్తె,తండ్రి సవరప్ప దక్షిణ మధ్య రైల్వేలో అసిస్టెంట్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ సేవలందిస్తున్నారు. కుటుంబం బోడుప్పల్, హైద్రాబాద్ లో నివసిస్తోంది. రోహిణి ప్రస్తుతం వికారాబాద్‌లోని మహవీర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఫైనల్ ఇయర్ ఎంబీబీఎస్ చదువుతోంది. 2025 సెప్టెంబర్‌లో, గోవాలో జరిగిన జాతీయ స్థాయి మిస్ ప్రీ ఉ ఐ ఇండియా పోటీలో తెలంగాణను ప్రాతినిధ్యం వహించిన రోహిణి, మిస్ రియాలిటీ షో,మిస్ టాలెంట్ షో అనే రెండు ప్రతిష్ఠాత్మక సబ్‌టైటిల్స్‌ను గెలుచుకుంది. అలాగే మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2022 విజేత ఇసాబెల్లా నుంచి పొందిన మార్గదర్శకత్వం ఆమె ప్రయాణానికి మరింత ప్రేరణనిచ్చింది. విద్యతో పాటు, రోహిణి ఒక శిక్షణ పొందిన కూచిపూడి శాస్త్రీయ నర్తకి, 2012 డిసెంబర్ 25న, హైద్రాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన మూడవ అంతర్జాతీయ కూచిపూడి నృత్య సదస్సులో భాగంగా సిలికాన్ ఆంధ్రా ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచంలోనే అతిపెద్ద కూచిపూడి నృత్య ప్రదర్శన మహా బృంద నాట్యంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 5,794 మంది కళాకారులు పాల్గొని ఒక గొప్ప సాంస్కృతిక మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా ఆమెకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికేట్ కూడా లభించింది. విద్యారంగం అందాల పోటీలను సమన్వయపరుచుకుంటూ,రోహిణి తన చదువుల్లో ప్రతిభ చూపుతూ, కళలు మోడలింగ్ పట్ల తన ఆసక్తిని కొనసాగిస్తోంది. తల్లిదండ్రుల అచంచలమైన సంపూర్ణ మద్దతుతో ఆమె తన కుటుంబంలోనే మొదటి వైద్యురాలు, మొదటి అందాల రాణిగా నిలిచింది. తన ప్రధాన లక్ష్యం మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, యువతులను ఆత్మవిశ్వాసంతో తమ కలలను సాధించేందుకు ప్రోత్సహించడం అని రోహిణి తెలిపారు. నిజమైన అందం రూపంలో కాదు; అది ఆత్మవిశ్వాసం, కరుణ ఇతరులను ప్రేరేపించే ధైర్యంలో ఉంటుందని ఆమె పేర్కొన్నారు. మా కాలనీ ఆడబిడ్డ ఇంకా ఉన్నత స్థితికి చేరుకోవాలి..బోడుప్పల్లోని శ్రీనివాస్ నగర్ కాలనీలో జయప్రకాష్ భారతి కుమార్తె కుమారి రోహిణి కనక మిస్ హౌరా ఇండియా 2026 గ్రాండ్ ఫినాలే అహ్మదాబాద్ ఆగస్టు 2026 న కిరీటాన్ని గెలుచుకోవడం ఎంతో ఆనందంగా ఉందని,అందులో మా కాలనీ బిడ్డ గెలుపొందడం ఎంతో గర్వకారణం గా ఉందని శ్రీనివాస్ నగర్ కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు తోటకూర చందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి వేమునూరి మురళీధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు అంజనేయులు, డాక్టర్.రాంచందర్, నర్సింగ్ రావు, గంగాధర్,కమిటీ సభ్యులు అబ్రహం మధు,శేకర్ రెడ్డి, ఓంకార్, శివకుమార్,వీర్ చందర్,సుబ్బారావు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరై రోహిణి కనక కి హృదయపూర్వక ధన్యవాదాలు, శుభాకాంక్షలు తెలిపారు.ముందు ముందు భవిష్యత్తులో మిస్ ఇండియా సాధించే దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు.

# తుక్కుగూడలో దారుణం

**- ప్రైమ్ కేర్ ఆస్పత్రిలో నర్సు శిరీష అనుమానాస్పద మృతి**

**- తుక్కుగూడ ప్రైమ్ కేర్ లో కలకలం**

**- రంగంలోకి దిగిన శంషాబాద్ డిసిపి మహేశ్వరం**

మహేశ్వరం ఆగస్టు 29 (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రముఖ ప్రైమ్ కేర్ ప్రైవేట్ హాస్పిటల్ లో విధులు నిర్వహిస్తున్న నర్సు శిరీష (పేరు మార్పు ఉ ండవచ్చు) అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. శుక్రవారం సాయంత్రం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. హాస్పిటల్ లోనే నర్సు విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించిన తోటి సిబ్బంది యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. విషయం కాస్తా బయటకు పొక్కడంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.



**పోలీసుల హుటాహుటిన దర్యాప్తు:**

సమాచారం అందుకున్న వెంటనే మహేశ్వరం పోలీసులు, ఆదిభట్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పంచనామా చేసి, హాస్పిటల్ సిబ్బందిని విడివిడిగా విచారిస్తున్నారు.ఘటన తీవ్రతను గమనించి శంషాబాద్ డీసీపీ రాజేష్ స్వయంగా ఆస్పత్రికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. ఆస్పత్రి యాజమాన్యం పాత్రపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.



**అన్ని కోణాల్లో విచారణ:**

మృతురాలు శిరీష గత కొంతకాలంగా ప్రైమ్ కేర్ హాస్పిటల్ లో నర్సుగా పని చేస్తున్నట్లు ప్రాథమికంగా తేలింది. అయితే ఆమె మృతికి గల కారణాలపై ఇంకా స్పష్టత రాలేదు. ఇది ఆత్మహత్యా? లేక ఎవరైనా హత్య చేసారా? తోటి సిబ్బందితో విభేదాలు ఉన్నాయా? వ్యక్తిగత కారణాలా? లేక యాజమాన్య వేధింపులా? అనే అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాతే అసలు మృతికి గల కారణం వెల్లడవుతుందని పోలీసులు తెలిపారు.ప్రస్తుతం తుక్కుగూడలో ఈ ఘటన హాట్ టాపిక్ గా మారింది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిబ్బంది భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.




# 22ఏ భూములపై బీఆర్ఎస్ సమరశంఖం

### -వారం రోజుల్లో పరిష్కరించాలి.. లేకుంటే కలెక్టరేట్ ముట్టడి: హరీశ్ రావు..




పటాన్‌చెరు, ఆగస్టు 29 (ప్రజా కలం) ప్రతినిధి

22ఏ నిషేధిత జాబితాలో భూములు, ఇళ్లు చేర్చడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడం, బ్యాంకు రుణాలు రాకపోవడం, కుల్పివేతల భయంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై పటాన్‌చెరులోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన బాధితుల సమావేశానికి బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత,మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు హాజరయ్యారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి,నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదర్శ్ రెడ్డి,మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. బాధితుల ఆవేదన విన్న హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 50,565 ఎకరాలు,దాదాపు లక్ష ఇళ్లు 22ఏ జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు. ఏళ్లుగా నివసిస్తున్న ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టడం దుర్మార్గమని,రేవంత్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో జీవో 58, 59 కింద 9 వేల మందికి పైగా పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని గుర్తుచేశారు. వారం రోజుల్లో 22ఏ సమస్య పరిష్కరించాలి. లేకుంటే రైతులు, బాధితులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడించి, సమస్య పరిష్కారం అయ్యే వరకు బైఠాయిస్తాం అని హరీశ్ రావు హెచ్చరించారు..




# ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభల గోడపత్రిక విడుదల

### కొమ్ము గళ్ళ రాజు ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు

కందుకూరు, ఆగస్టు 29,(ప్రజా కలం)

కందుకూరు మండల కేంద్రంలోని చౌరస్తాలో సెప్టెంబర్ 6, 7, 8 తేదీలలో కరీంనగర్ పట్టణంలో జరిగే తెలంగాణ రాష్ట్ర ఏఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని గోడ పత్రికను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటియుసి కార్యవర్గ సభ్యులు కొమ్ము గళ్ళ రాజు ఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్లో జరిగే సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో మహాసభలను జయప్రదం చేయాలని ఈ మహాసభలలో నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని,కార్మికుల కనీస వేతనాలు కార్మిక సంక్షేమ పథకాలు రంగారెడ్డి జిల్లా కేంద్రంగా ఈఎస్ఐ హాస్పిటల్ పరిశ్రమలలో ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయాలని వలస కార్మికులకు రక్షణ కల్పించాలని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మ రాదని అనేక సమస్యలపై తీర్మానాలు, భవిష్యత్ కార్యాచరణ ఈ మహాసభలలో చర్చలు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల అధ్యక్షుడు యాదగిరి మండల కార్యదర్శి కొమ్ము గళ్ళ ప్రవీణ్,కవిత, మరియమ్మ రమేష్ ఇతరులు పాల్గొన్నారు.




Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by KALAKONDA RAMAKRISHNA, Printed at TEJOMAI PUBLICATION, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013 Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com